జొహరాపురం హౌసింగ్ బోర్డు కాలనీ దగ్గర దుస్థితి

## మంత్రి పదవులు
# దక్కేదెవరికి..?

**- ఉమ్మడి జిల్లాలోని ఇద్దరికి ఇచ్చే అవకాశం**
**- రేసులో పలువురు ఎమ్మెల్యేలు**

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి కూటమి ఊహించని రీతిలో సీట్లు సాధించింది. త్వరలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటు కానుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి మంత్రి పదవులు ఎవరికి దక్కుతాయోనన్న ఉత్కంఠ నెలకొంది. మంత్రి పదవి కోసం పలువురు ఎమ్మెల్యేలు రేసులో ఉన్నారు...

**ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి**

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా టిడిపి కూటమి ఊహించని స్థాయిల్లో సీట్లను దక్కించుకుంది. 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో టిడిపి అభ్యర్థులు, ఒక చోట బిజెపి అభ్యర్థి గెలుపొందారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటు కానుంది. దీంతో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి గెలుపొందిన కూటమి అభ్యర్థుల్లో ఎవరికి మంత్రి పదవులు దక్కుతాయోనన్న ఉత్కంఠ నెలకొంది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఇద్దరికి మంత్రి పదవులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గెలుపొందిన ఎమ్మెల్యేల్లో ఎక్కువ మంది మంత్రి పదవిని ఆశిస్తున్నారు. డోన్‌లో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మీద కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి విజయం సాధించారు. కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి మూడు సార్లు కర్నూలు ఎంపీగా ఎన్నికయ్యారు. 1991లో తొలిసారి ఎంపీగా విజయం సాధించారు. మళ్లీ 2004లో, 2009లో కర్నూలు ఎంపీగా విజయం సాధించారు. 2012 నుంచి కేంద్ర రైల్వే సహాయ మంత్రిగా పని చేశారు. ఎంపీగా రాజకీయ అనుభవం ఉన్న ఆయన తొలిసారి శాసనసభలో అడుగు పెడుతున్నారు. సీనియర్ నాయకులు కావడంతో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి మంత్రి పదవి కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బనగానపల్లె నుంచి బిసి జనార్ధన్ రెడ్డి రెండో సారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందినా ఆయనకు మంత్రి పదవి దక్కలేదు. వైసిపి ప్రభుత్వంలో ఆయన జైలుకు కూడా వెళ్లి వచ్చారు. టిడిపి కోసం బాగా కష్టపడి పని చేశారన్న అభిప్రాయం పార్టీ అధిష్టానంలో ఉండటంతో ఆయనకు మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. నంద్యాల నుంచి గెలుపొందిన ఎన్ఎండి ఫరూక్ కూడా మంత్రి పదవి రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎమ్మెల్సీగా ఎన్నికై మండలి ఛైర్మన్‌గాను, మంత్రిగాను పని చేశారు. ఎన్‌టిఆర్ ప్రభుత్వం నుంచి ఆయన టిడిపిలోనే ఉండటం, రాజకీయ అనుభవం ఉండటంతో ఆయనకు మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఆళ్లగడ్డ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన అఖిలప్రియ కూడా మంత్రి పదవి రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ఆమె గతంలోనూ ఎమ్మెల్యేగా ఎన్నికై పర్యాటక శాఖ మంత్రిగా పని చేశారు. పాణ్యం నియోజకవర్గం నుంచి గెలుపొందిన గౌరు చరిత రెడ్డి కూడా మంత్రి పదవి రేసులో ఉన్నట్లు సమాచారం. ఆరు సార్లు ఎమ్మెల్యేగా పని చేసిన కాటసాని రాంభూపాల్ రెడ్డిపై ఆమె భారీ మెజార్టీతో విజయం సాధించడంతో ఆమెకు మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కర్నూలు జిల్లా నుంచి మంత్రి పదవి రేసులో కర్నూలు ఎమ్మెల్యే టిజి భరత్, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బివి జయనాగేశ్వరరెడ్డి ఉన్నట్లు సమాచారం. కర్నూలు నుంచి టిజి భరత్ రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇంతియాజ్‌పై గెలుపొందారు. యువకులకు అవకాశం ఇస్తే బాగుంటుందనే ఉద్దేశంతో భరత్‌కు మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎమ్మిగనూరు నుంచి బివి జయనాగేశ్వరరెడ్డి మాజీ ఎంపీ బుట్టా రేణుకపై గెలుపొందారు. జయనాగేశ్వరరెడ్డి తండ్రి బివి మోహన్ రెడ్డి చంద్రబాబుకు సన్నిహితుడు కావడం, ముందు నుంచి బివి కుటుంబం టిడిపిలోనే పని చేస్తుండటం, గతంలో జయనాగేశ్వరరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచినా మంత్రి పదవి ఇవ్వలేకపోవడంతో ఈ సారి ఆయనకు మంత్రి పదవి ఇవ్వాలని అధిష్టానం యోచిస్తున్నట్లు సమాచారం. అయితే ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ఎవరెవరికి మంత్రి పదవులు దక్కుతాయో అనేది ఆ పార్టీ అధికారికంగా ప్రకటించే వరకూ వేచి చూడాల్సిందే.

# 14 మండలాల్లో వర్షం

**- అస్తవ్యస్తమైన రోడ్లు - వాహనదారులకు తప్పని అవస్థలు**
**- ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికులు**

**ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్**

జిల్లాలో నైరుతి రుతుపవనాలు విస్తారంగా వ్యాపించాయి. జూన్ మాసంలో కురవాల్సిన సాధారణ వర్షపాతం 77.7 మిల్లీమీటర్లకు గాను 49.4 మిల్లీమీటర్లు మొదటి వారంలోనే కురిసింది. రైతులకు విత్తన సాగుకు అనుకూలంగా ఉన్నా గ్రామీణ ప్రాంతాల రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి రహదారులు అస్తవ్యస్తంగా మారి ప్రయాణికులు వెళ్లలేని స్థితిలో మారాయి. చాలా గ్రామాల్లో రోడ్లు నీటితో కోతకు గురయ్యాయి. ఇప్పటికే జిల్లాలో చాలా గ్రామాలకు సరైన రహదారులు లేకపోవడంతో వర్షాలకు మరింత అధ్వానంగా తయారయ్యాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు రహదారులను గుర్తించి వెంటనే మరమ్మతులు చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు. జిల్లాలో ఇంకా అధిక వర్షాలు కురుస్తాయని అధికారులు పేర్కొంటున్నారు. ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షపాతం నమోదయింది. అత్యధికంగా ఓర్వకల్లులో 67.2, వెల్దుర్తి 47.2, కౌతాళం 38.2, క్రిష్ణగిరి 15.6, కర్నూలు అర్బన్ 12.6, ఎమ్మిగనూరు 10.4, కర్నూలు రూరల్ 10.0, కల్లూరు 9.4, గూడూరు 6.2, దేవనకొండ 5.8, తుగ్గలి 3.8, కోడుమూరు 2.8, గోనెగండ్ల 2.0, ఆదోని 2.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఇప్పటికే రైతులు విత్తనాన్ని సిద్ధం చేసుకున్నారు. అనుకున్న స్థాయిలో వర్షాలు కురిస్తే ఖరీఫ్ ఆశాజనకంగా ఉంటుందని అధికారులు, రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నగరవనం క్రాస్ దగ్గర నీటితో నిండిన రోడ్లు

మాట్లాడుతున్న ఆనంద్ బాబు

### కొత్త పాలకులైనా
# దళితుల సమస్యలను పరిష్కరించాలి

**- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు**

**ప్రజాశక్తి - గోనెగండ్ల**

దళిత సమస్యల పరిష్కారం పట్ల పాలకవర్గాల దృష్టి లేకపోవడంతో దళితుల సమస్యలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయని, మెజారిటీ ప్రజల ఓట్ల ద్వారా ఎన్నికైన నూతన ప్రభుత్వమైనా ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.ఆనంద్ బాబు కోరారు. గురువారం గోనెగండ్ల బస్టాండ్ ఆవరణలో సమావేశం నిర్వహించారు. కెవిపిఎస్ మండల అధ్యక్షులు మారేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ బాబు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.కరుణాకర్ మాట్లాడారు. రాష్ట్రంలో నూతనంగా కొలువుదీరనున్న రాష్ట్ర ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. అందరికీ పింఛన్లు పెంచుతూ వచ్చిన గత ప్రభుత్వం డప్పు వృత్తి కళకు సంబంధించిన పింఛను మాత్రం పెంచలేదని వాపోయారు. అలాగే శ్మశానంలో గుంతలు తీసే వృత్తిదారులను, తంబుర కళాకారులను ఇప్పటికీ వృత్తిదారులుగా గుర్తించలేదన్నారు. చర్మకారులకు ఇవ్వాల్సిన కిట్లు, వృత్తి కేంద్ర నిర్మాణం పట్ల ఎలాంటి చొరవచూపలేదని విమర్శించారు. అందుకే గత ప్రభుత్వం సామాజిక తరగతుల ఆగ్రహానికి గురి కావాల్సి వచ్చిందన్నారు. కొత్తగా అధికారంలోకి రాబోతున్న నాయకులైనా ఈ సామాజిక అసమానతలను తొలగించి, దళిత వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేకపోతే పోరాటం తప్ప మరో మార్గం లేదన్నారు. ఐక్యత పోరాటం ద్వారా సమస్యలను పరిష్కరించుకునేందుకు సిద్ధం కావాలని కోరారు. కెవిపియస్ మండల నాయకులు దేవదాసు, ఎస్.రంగన్న, సంటెన్న, దస్తగిరి, పెద్ద కరెన్న, కొండయ్య, మునిస్వామి, జయరాజు, ఆదాం, యోహాను, నగేష్, భీమన్న, రంగన్న పాల్గొన్నారు.

# అందని జీతాలు...

**- క్లాప్ ఆటో డ్రైవర్లు విలవిల - ఆరు నెలలుగా జీతాలు లేవు**
**- జీతాలు ఇవ్వని రెడ్డి ఏజెన్సీ**
**- మాట తప్పిన కమిషనర్**

**ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్**

కర్నూలు నగరం శుభ్రంగా, అందంగా ఉండాలంటే ఇంటింటి చెత్త సేకరించే క్లాప్ డ్రైవర్ల పాత్ర ముఖ్యమైంది. స్వచ్ఛభారత్‌లో భాగంగా కర్నూలు నగరానికి స్వచ్ఛ సర్వేక్షన్‌లో మంచి ర్యాంకు రావడానికి క్లాప్ డ్రైవర్లు కారణం. అలాంటి క్లాప్ ఆటోడ్రైవర్లు రోజూ వారికి కేటాయించిన ఇళ్ల వద్దకు వెళ్లి ఇంటింటి చెత్త సేకరణ చేపట్టాలి. జగన్ ప్రభుత్వంలో 'రెడ్డి ఏజెన్సీ' ద్వారా ఈ క్లాప్ ఆటో డ్రైవర్లకు జీతాలు ఇచ్చే కార్యక్రమం అప్పజెప్పింది. నగరపాలక సంస్థ కమిషనర్ రెడ్డి ఏజెన్సీకి డబ్బులు జమ చేస్తే రెడ్డి ఏజెన్సీ వారు క్లాప్ ఆటో డ్రైవర్లకు నెలనెలా జీతాలు ఇవ్వాలి. ఎక్కినప్పటి నుంచి రకరకాల ఇబ్బందులు పడుతూ తమ జీవితాలను పణంగా పెట్టి అప్పులు చేసి పనిచేస్తున్న క్లాప్ ఆటోడ్రైవర్లకు సక్రమంగా జీతాలు ఇవ్వడంలో రెడ్డి ఏజెనీ, నగరపాలక సంస్థ ఘోరంగా విఫలమయ్యాయి. వీరు 2022 మార్చి నెలలో రెడ్డి ఏజెన్సీ ద్వారా కర్నూలు నగర పాలక సంస్థలో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమానికి నియమింపబడ్డారు. గతేడాది అక్టోబర్‌లో జీతాలు అందకపోవడంతో వందమంది డ్రైవర్లు 20 రోజులు ఒకసారి, 39 రోజులు మరోసారి సమ్మె చేశారు. ఆ సమయంలో నగరమంతా చెత్తమయమై కంపుకొట్టింది. ఇటు కార్పొరేటర్ల నుంచి, రాజకీయ నాయకుల నుంచి ఒత్తిడి రావడంతో రెడ్డి ఏజెన్సీ వారితో మాట్లాడగా నవంబర్ వరకు వారికి ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వాలని కమిషనర్‌కు ఉత్తర్వులు పంపారు. దీనితో కమిషనర్ నవంబర్ వరకు పెండింగ్‌లో ఉన్న జీతాలను ఇవ్వటానికి ఫైల్ సిద్ధం చేసి ఇచ్చారు. ఆ తర్వాత కమిషనర్ రోజూ రూ.400 చొప్పున ఇస్తామని, ఆటోలను తీయాలని చెప్పడంతో సమ్మె విరమించి, చెత్త సేకరించే ఆటోలను తీసి ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఇప్పుడు మళ్లీ సమస్య మొదటికి వచ్చింది. నాటి నుంచి నేటి వరకు ఆరు నెలలుగా ఆటోడ్రైవర్లకు కమిషనర్ ఇస్తామన్న రోజుకు రూ.400 కూడా డబ్బులు ఇవ్వకుండా వేధిస్తూ వారితో పని చేయించుకుంటున్నారు. గత ఆరు నెలలుగా జీతాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారికి కనీసం పనిచేయాలంటే తినడానికి తిండి అయినా ఉండాలి. కిరాణ సరుకులు తెచ్చి అప్పులు చేశారు. ఒకటి, రెండు నెలలు చూసి పాత డబ్బులు ఇస్తే కొత్తగా సరుకులు ఇస్తామని చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో వారి కుటుంబాలు అప్పులు చేసి జీవనం సాగిస్తున్నాయి. గత నెలలో కార్మికులు షఫీ, రఘు శేఖర్, రాజేష్, మహేష్, అశోక్, దుర్గ, అమిత్, గిరి, దస్తగిరి, వెంకటస్వామి, హరికృష్ణ గౌడ్‌లు కమిషనర్‌ను కలిసి తమ గోడును విన్నవించుకున్నారు. ఎన్నికల కోడ్ ఉందని, ఎన్నికల అయ్యాక మంచి రోజులు వస్తాయని, మిమ్మల్ని ఆప్కాస్‌లో కలుపుతారని చెబుతూ కమిషనర్ వారిలో ఆశలు రేకెత్తిస్తూ పనులు చేయించుకుంటున్నారు. నెలనెల కార్మికులకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వడం లేదు. 91 క్లాప్ ఆటోలకు 91 మందితోపాటు మరో 9 మంది అదనపు సిబ్బందిని తీసుకున్నారు. వారిలో ఎవరైనా అనివార్య పరిస్థితుల్లో పనికి రాలేని పరిస్థితుల్లో అదనపు 9 మందిని వాడుకునేవారు. ప్రస్తుతం అదనంగా ఉన్న వారిని కూడా తొలగించేశారు. ప్రస్తుతం పని చేస్తున్న ఆటో డ్రైవర్లు రోజూ తప్పకుండా ఇంటింటి చెత్త సేకరణ చేపట్టాలి. కార్మికుల విషయంలో కమిషనర్ జోక్యం చేసుకొని ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న రూ.72 వేలు చెల్లించి వారిని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**అప్పులయ్యాయి.. ఆదుకోండి...**

**- షఫీ, క్లాప్ ఆటో డ్రైవర్**

నగరపాలక సంస్థ ద్వారా మాకు రావాల్సిన డబ్బులు రాకపోవడంతో ఆరు నెలలుగా ఇంట్లో సరుకుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కిరాణ సరుకుల వారు అప్పు ఇవ్వడం లేదు. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వీటికి తోడు ఈ నెలలో పిల్లల చదువుల కోసం ఫీజులు కూడా చెల్లించాల్సి ఉంటుంది. మాకు పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వాలని కోరినా అధికారులు స్పందించడం లేదు.

**మాట తప్పిన కమిషనర్**

**- రఘు శేఖర్, క్లాప్ ఆటో డ్రైవర్**

జీతాల కోసం సమ్మె చేసిన సందర్భంగా కమిషనర్ అందరి సమక్షంలో ఇక నుంచి రెడ్డి ఏజెన్సీతో సంబంధం లేకుండా రోజూ రూ.400 ఇస్తామని మాట ఇచ్చి ఆటోలను తీయించారు. కానీ డిసెంబర్ నెల నుంచి ఇంతవరకు మాకు రావాల్సిన డబ్బులు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కమిషనర్‌ను ప్రతి నెలా కలిసిన ఏదో ఒక సాకు చెబుతూ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు. అప్పులు తడిసి మోపెడయ్యాయి. పిల్లల చదువులు ప్రశ్నార్థకంగా మారాయి. నగరపాలక సంస్థ కమిషనర్, హెల్త్ ఆఫీసర్, శానిటరీ సూపర్‌వైజర్లు కూర్చుని చర్చించుకుని వీలైనంత త్వరలో వేతనాలు ఇచ్చి ఆదుకోవాలి. లేకపోతే మళ్లీ సమ్మెలోకి వెళ్లాల్సి వస్తుంది.

కలెక్టరేట్‌లోని ఈవిఎం గోడౌన్లను సీల్ చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి

## గోడౌన్‌లో ఈవిఎంలు

**- జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సృజన**

**ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్**

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కౌంటింగ్ అనంతరం కౌంటింగ్ కేంద్రం నుంచి తీసుకొచ్చిన ఈవిఎంలను నియోజకవర్గాల వారీగా కలెక్టరేట్‌లోని ఈవిఎం గోడౌన్‌లో భద్రపరచి, సీల్ వేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. గురువారం కౌంటింగ్ అనంతరం కౌంటింగ్ కేంద్రం నుంచి తీసుకొచ్చిన ఈవిఎంలను గోడౌన్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో భద్రపరిచి సీల్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాకు సంబంధించిన అన్ని ఈవిఎంలను కలెక్టరేట్‌లోని గోడౌన్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో భద్రపరిచి సీల్ వేసినట్లు తెలిపారు. ఈవిఎం గోడౌన్‌లోని కింద అంతస్తులో అసెంబ్లీ, పార్లమెంట్‌కు సంబంధించిన వివి ప్యాట్‌లను, పైన అంతస్తులో అసెంబ్లీ, పార్లమెంట్‌కు సంబంధించిన బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లను భద్రపరచి సీల్ వేశామని వివరించారు. జెసి నారపురెడ్డి మౌర్య, అసిస్టెంట్ ట్రెయినీ కలెక్టర్ చల్లా కల్యాణి, డిఆర్ఒ మధుసూదన రావు, డిపిఒ నాగరాజు నాయుడు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

**- డాక్టర్ ఆది నాగేష్**

**ప్రజాశక్తి - పత్తికొండ**



సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎండి జనరల్ మెడిసిన్ సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ డాక్టర్ ఆది నాగేష్ తెలిపారు. గురువారం పత్తికొండ ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో దోమల నుంచి సంక్రమించే డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, జపనీస్ ఎన్‌సెఫలైటిస్ వ్యాధుల నివారణ చర్యలను తీసుకోవాలని తెలిపారు. డెంగీ దోమల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాప్తి చెందుతుందని చెప్పారు. నీళ్ల నిల్వ ఉండే ప్రదేశాల్లోనే ఇవి ఎక్కువగా పెరుగుతాయన్నారు. వర్షాకాలంలో నీటి కాలుష్యం వల్ల టైఫాయిడ్, కలరా, హెపటైటిస్–బి వంటి అంటువ్యాధులు సోకకుండా నీటిని కాచి చల్లార్చి, ఫిల్టర్ చేసుకొని తాగాలని తెలిపారు. ఇళ్లలో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు ఉంటే దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని సూచించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఆరోగ్య సమస్యలు ఉంటే ప్రభుత్వాస్పత్రిలోని డాక్టర్లను సంప్రదించాలని కోరారు.

### వర్షపు నీరు, మురికి నీటితో
## రాకపోకలకు అంతరాయం

**ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్**

కర్నూలు నగరంలోని వెంకటరమణ కాలనీ ప్రధాన రోడ్డుపై వర్షం వచ్చిన ప్రతి సారీ మురికి నీటితోపాటు, వర్షపు నీరు రోడ్డుపై నిలిచి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. రోడ్లు, భవనాల శాఖ వారు ఎగుడు దిగుడుగా రోడ్లు వేయడంతో వర్షం వచ్చినప్పుడల్లా ఈ పరిస్థితి ఏర్పడుతోంది. రద్దీగా ఉండే ఈ రోడ్డుపై ఒక రోజు వర్షం వస్తే రెండు రోజులు మురికి నీరు, వర్షపు నీరు నిలబడుతోంది. ఆటోలు వెళ్లేటప్పుడు ద్విచక్ర వాహనదారులపై నీళ్లు చిట్లడంతో ఇబ్బంది పడుతున్నారు. ఇదే ప్రాంతంలో నిలిచిన నీళ్ల మధ్య తాగు నీటి పైపులైన్ వాల్వు ఉండడం, నిలిచిన వర్షం నీటిలో ఆ వాల్వు ఎక్కడుందో సంబంధిత సిబ్బంది తెలుసుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. దీని వల్ల ఈ మురికి నీరు వాల్వు ద్వారా తాగునీటి పైపులో చేరి తాగునీరు కలుషితమై ప్రజలు అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉంది. వర్షం వచ్చిన ప్రతిసారి ఆ ప్రాంతంలో ఉండే చిరు వ్యాపారులు తమ వ్యాపారాలు బంద్ చేసుకోవాల్సి వచ్చిందని పట్టణ పౌర సంక్షేమ సంఘం నగర నాయకులు కె. శ్రీనివాసులు, చిరు వ్యాపారులు మాలిక్ భాష, పురుషోత్తం రెడ్డి, సరళ, సుంకులమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి రోడ్డుపై నీరు నిలవకుండా చేయాలని కోరారు.

వెంకటరమణ కాలనీలో నిలిచిన వర్షపు నీరు

## కొత్త పోర్టల్‌తో ఇబ్బందులు

**ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్**

కర్నూలు నగరపాలక సంస్థలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను అందించే కొత్త పోర్టల్‌తో త్వరితగతిన ధ్రువీకరణ పత్రాలు ఇవ్వలేకపోతున్నామని డిఎస్ఓ కృష్ణమోహన్ అన్నారు. ఈ విధానం గ్రామీణ, చిన్న మున్సిపాలిటీల్లో మాత్రమే సరిపోతుందన్నారు. కార్పొరేషన్లలో ఈ విధానం సరిపోదన్నారు. కార్పొరేషన్లలో ప్రతి రోజు 100 సర్టిఫికెట్లు ఇచ్చే విధంగా ఉన్న పాత పద్ధతిని మార్చి కొత్త విధానం తీసుకురావడంతో రోజుకు కేవలం 20 నుండి 30 సర్టిఫికెట్లు మాత్రమే ఇవ్వగలిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. కొత్త విధానంలో పేరు నమోదు చేసిన తర్వాత ఓటిపి వస్తుందని, ఆ ఓటీపీని ఎంటర్ చేసి మళ్లీ సరి చూసిన తర్వాత మళ్లీ ఓటిపి వస్తుందని, ఆ ఓటిపిని ఎంటర్ చేసిన తర్వాత ఓకే అంటే అప్పుడు సర్టిఫికెట్ రెడీ అవుతుందని, దీంతో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలో ఆలస్యమైతే అధికారులను ప్రజలు కొట్టే పరిస్థితి ఉందన్నారు. కొన్ని సందర్భాలలో మరణ ధ్రువీకరణ పత్రాలు తత్కాల్ ద్వారా త్వరితగతిన ఇవ్వాల్సి వస్తుందని, అలాంటివి ఆలస్యమైతే ఓపికతో ప్రజలు ఉండలేని పరిస్థితులు నేడు ఉన్నాయన్నారు. కొత్తగా సివిల్ రిజిస్ట్రేషన్ సేవలలో చాలా తప్పులు ఉన్నాయని, దీనివల్ల ఇటు అధికారులు అటు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. 21 రోజుల తర్వాత లేట్ రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం లేదని, ఆ ప్రక్రియ పూర్తి కావాలంటే 21 రోజులు దాటితే ఇచ్చే ప్రక్రియను సులభం చేసి ప్రజలకు త్వరితగతిన ధ్రువీకరణ పత్రాలు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

## శ్యాంబాబుకు వికలాంగుల సమాఖ్య శుభాకాంక్షలు

**ప్రజాశక్తి-క్రిష్ణగిరి**

పత్తికొండ ఎమ్మెల్యేగా ఎన్నికైన కెఇ.శ్యాంబాబును, టిడిపి మండల అధ్యక్షులు శ్రీరాములును క్రిష్ణగిరి ప్రగతి మండల వికలాంగుల సమాఖ్య అధ్యక్షులు రాజేంద్ర, ఉపాధ్యక్షులు ఈశ్వరయ్య, సభ్యులు ధనంజయ, రాజయ్య, మహేశ్వరి, వీరేశమ్మ, ఉరుకుందమ్మ గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శ్యాంబాబు చేతుల మీదుగా కేక్ కట్ చేసి సంతోషాన్ని పంచుకున్నారు. అనంతరం సమాఖ్య నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన శ్యాంబాబు మరెన్నో ఉన్నత పదవులు అలంకరించి నియోజకవర్గంలోని ప్రజల, వికలాంగుల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. టిడిపి మండల అధ్యక్షుడు శ్రీరాములు మాట్లాడుతూ ప్రభుత్వం నియమించే వాలంటరీల నియామకంలో వికలాంగులకు పెద్దపీట వేస్తామని పేర్కొన్నారు.

## భరత్‌ను కలిసిన ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు

**ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్**

కర్నూలు ఎమ్మెల్యే టిజి భరత్‌ను గురువారం పలువురు ప్రముఖులు, పార్టీల నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వి.సి.హెచ్ వెంగల్ రెడ్డి, సెక్రటరీ జవహర్‌లాల్, మాజీ జిల్లా అధ్యక్షుడు క్రిష్టఫర్ దేవకుమార్, సిటీ ప్రెసిడెంట్ కాశెన్న, క్లాస్ 4 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, పలు ఉద్యోగ సంఘాల నాయకులు ఎమ్మెల్యే టి.జి భరత్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

భరత్‌ను కలిసిన నాయకులు

## కార్యకర్తలు అధైర్య పడొద్దు

**- అండగా ఉంటాం...**

**- కోడుమూరు సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, డాక్టర్ ఆదిమూలపు సతీష్**

**ప్రజాశక్తి - కర్నూలు క్రైం**

కోడుమూరు నియోజకవర్గంలో వైసిపి కార్యకర్తలు అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని వైసిపి కోడుమూరు నియోజవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, డాక్టర్ ఆదిమూలపు సతీష్ తెలిపారు. గురువారం కర్నూలు నగరంలోని ఎక్యాంపులో ఉన్న సతీష్ స్వగృహం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం అందిస్తామన్న పథకాలకు ప్రజలు ఆకర్షితులు కావడం వల్ల వైసిపి ఓడిపోయిందని తెలిపారు. వైసిపి నాయకులకు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా అండగా ఉంటామని, ఈ ఐదేళ్లు వారికి వెన్నంటే ఉంటామని హామీఇచ్చారు. వైసిపి ప్రభుత్వం ప్రజలకు ఎలా పథకాలు అందించిందో టిడిపి ప్రభుత్వం కూడా మేనిఫెస్టో ప్రకారం ప్రజలందరికీ పథకాలు అందజేసే విధంగా కృషి చేయాలని కోరారు. కోడుమూరు నియోజకవర్గం నుంచి సుమారు 80 వేల మంది ప్రజలు తమకు అండగా నిలిచారని, వైసిపి లోపాలను సరిచేసుకొని మరింత కష్టపడి వచ్చే ఎన్నికల్లో వైసిపికి అండగా ఉండాలని తెలిపారు. జడ్‌పిటిసిలు రఘునాథ్ రెడ్డి, ప్రసన్నకుమార్, వైస్ ఎంపిపి నెహెమ్యా, గూడూరు మున్సిపల్ ఛైర్మన్ జె.వెంకటేశ్వర్లు, వైస్ ఛైర్మన్లు అస్లాం బాషా, చిన్న లక్ష్మన్న మండల కన్వీనర్లు మహబూబ్ బాషా, రమేష్ నాయుడు, మండల మాజీ ఉపాధ్యక్షులు డి.వాసు, సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, పాండురంగన్న, కౌన్సిలర్ మద్దిలేటి, ప్రసన్నకుమార్, మల్లారెడ్డి, మాజీ ఎంపిటిసి చిన్న లక్ష్మన్న, ఎస్ఎం.బాషా, గుడిపాడు లక్ష్మీకాంతరెడ్డి, లింగమయ్య, ఏసేపు, సురేష్, శాంతులు, ఆదాం, వెంకటేష్, వెంకటేష్, అనిల్ బాషా, అహ్మద్ అలీ, వెంకటేష్, భాస్కర్, ఫిరోజ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గౌరు దంపతులను సన్మానిస్తున్న పల్లె ప్రభాకర్ రెడ్డి, రామన్ గౌడ్, రవి ప్రకాష్ గౌడ్, మహేష్ గౌడ్, విజయ్ కుమార్, మస్తాన్ నాయుడు

## గౌరు దంపతులకు ఘన సన్మానం

**ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్**

పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యేగా విజయం సాధించిన గౌరు చరిత రెడ్డికి, గౌరు వెంకటరెడ్డికి గజమాలలు, పుష్పగుచ్ఛాలు ఇచ్చి, కేకులు కట్ చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ అధికారులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకు లు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు గురువారం శుభాకాంక్షలు తెలిపారు.

**కర్నూలు కలెక్టరేట్ :** గౌరు చరితారెడ్డిని టిడిపి ఓర్వకల్లు మండల నాయకులు, కార్యకర్తలు కలిసి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు గౌరు వెంకటరెడ్డిని పూలమాలలతో సన్మానించారు. టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పరిపాలనకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నన్నూరు నుంచి టిడిపి నాయకులు విశ్వేశ్వర్ రెడ్డి, ఖాజామియ్యా, విజయుడు, అయ్యన్న, పూడిచర్ల నుంచి రాజన్న, పాలకొల్లు సుధాకర్ రెడ్డి, గుట్టపాడు మోహన్ రెడ్డి కలిసి ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు.

## జొన్నగిరిలో వజ్రం లభ్యం

**- రూ.2 లక్షలకు కొనుగోలు**

**ప్రజాశక్తి - తుగ్గలి**

మండలం పరిధిలోని జొన్నగిరిలో శుక్రవారం వజ్రం లభ్యమయింది. జొన్నగిరి గ్రామానికి చెందిన ఒక రైతు తన పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ ఉండగా ఆ రైతుకు వజ్రం దొరికింది. ఆ వజ్రాన్ని మద్దికెర మండలం పెరవల్లి గ్రామానికి చెందిన ఒక వ్యాపారి రూ.2 లక్షలకు కొనుగోలు చేసినట్లు తెలిసింది. దాదాపు గత నెల నుండి మండలంలో 20 వజ్రాలు పైగా లభ్యం అయ్యాయి. ఈ వజ్రాలను గుత్తి, పెరవలి, జొన్నగిరి గ్రామాలకు చెందిన కొందరు వజ్రాల వ్యాపారస్తులు కొనుగోలు చేసినట్లు తెలిసింది. వర్షం పడితే చాలు ఇక్కడ వజ్రాలు లభ్యమవుతాయి. అత్యంత విలువైన వజ్రాలు కూడా వ్యాపారస్తులు తక్కువ రేట్లలో కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వజ్రాలు విలువ తెలియని అమాయక ప్రజలు లక్షల విలువ చేసే వజ్రాలను సైతం కేవలం తక్కువ రేట్లకే అమ్ముకుంటున్నారు.

## సుంకలమ్మ ఆలయంలో భక్తుల సందడి

**ప్రజాశక్తి - తుగ్గలి**

మండలంలోని రాంపల్లి గ్రామ సమీపంలోని సుంకులమ్మ ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. అమావాస్య కావడంతో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ అర్చకుడు యోగేష్ ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాంపుల్లయ్య యాదవ్

## గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులను పూర్తి చేయాలి

**- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాంపుల్లయ్య యాదవ్**

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

జిల్లాలోని గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని కాంగ్రెస్ కర్నూలు ఎంపీ అభ్యర్థి రాంపుల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేకపోతే జగన్‌కు పట్టిన గతే టిడిపి పడుతుందని తెలిపారు. జగన్ నియంతలా వ్యవహరించారని, అలాంటి పాలనకు జనం ఓటు ద్వారా బుద్ధి చెబుతారని అన్నారు. ప్రత్యేక హోదా కోసం చంద్రబాబు నాయుడు ఇండియా కూటమిలో జతకట్టాలని, లేకపోతే మోడీని ఒప్పించి ప్రత్యేక హోదా సాధించాలని ఆయన కోరారు. కర్నూలు జిల్లాలో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, కార్మికులను ఆదుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తనకు పార్లమెంట్ నియోజకవర్గంలో 70 వేల ఓట్లకు పైగా ఓట్లు వచ్చాయని, తనకు సహకరించిన ఓటర్లకు, ఉద్యోగులకు, పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, మహిళలకు కృతజ్ఞతలు తెలిపారు. డిసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తూరు సత్యనారాయణ గుప్త, స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ నరసింహ యాదవ్ పాల్గొన్నారు.

**గ్రామ ప్రధాన రచ్చకట్టకిరువైపులా**

## చెత్తాచెదారం తొలగించండి

**- సర్పంచికి గ్రామస్తుల వినతి**

**ప్రజాశక్తి - చిప్పగిరి**

రచ్చకట్టకిరువైపులా ఉన్న చెత్తాచెదారం, వాహనాలు

మండలంలోని బంటన హాల్ గ్రామంలో ప్రధాన కూడలి మధ్యన ఉన్న రచ్చకట్టకు ఇరువైపులా కొంతమంది ఇసుక, కంకర, వాహనాలు చెత్తాచెదారం వేస్తున్నారని, వాటిని తొలగించాలని గ్రామస్తులు సర్పంచిని, సచివాలయ సిబ్బందిని కోరుతున్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రధాన రచ్చకట్ట దగ్గరకు వెళ్లాలంటే ఇరువైపులా చెత్తాచెదారం, వాహనాలు అడ్డంగా పెడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా చెత్తాచెదారం వల్ల తేళ్లు, విష పాములు కనపడుతున్నాయని చెప్పారు. అక్కడికి వెళ్లాలంటే భయమేస్తోందని, కట్టకిరువైపులా ఉన్న వాటిని తొలగించాలని కోరారు. సాయంత్రం వృద్ధులు, పిల్లలు అక్కడికి వెళ్లి కూర్చుంటారని, సమస్యకు పరిష్కారం చూపాలని తెలిపారు.

## సుదీర్ఘ పోరాటాలే అధికార పార్టీ ఓటమి

**- సంబరాల్లో సమతా సైనిక్ దళ్**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

అధికార పార్టీ అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కొన్ని నెలలుగా సమతా సైనిక్ దళ్ సుదీర్ఘ పోరాటాలే ద్వారానే అధికార పార్టీ ఓటమి చవిచూసిందని సమతా సైనిక్ దళ్ రాయలసీమ కన్వీనర్ రంగయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో సమతా సైనిక్ దళ్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడారు. సమతా సైనిక్ దళ్ నాయకులపైనా, కార్యకర్తలపైనా అధికార పార్టీ నాయకులు అక్రమ కేసులు బనాయించిన పట్టువీడకుండా ఉద్యమాలు, పోరాటాలు చేశామని తెలిపారు. దళితులపై చిన్న చూపు చూసిన ఏ రాజకీయ పార్టీకైనా ఇలాగే సమాధానం చెబుతామన్నారు. కోడి కత్తి శీనుపై అక్రమ కేసు ఏ స్థితికి దాపరించిందో అందరికీ తెలిసిందేనన్నారు. జిల్లా అధ్యక్షులు మల్లేష్, వైస్ ప్రెసిడెంట్ పరమేష్, యువదళం అధ్యక్షులు నల్లన్న, జిల్లా నాయకులు బలరాం, రాముడు, నరసింహ, నరసప్ప, సమతా సైనిక్ దళ్ సీనియర్ నాయకులు రాజోలప్ప, చిన్న రంగన్న, గుడికల్ చిన్న రంగన్న, యువనాయకులు సూరి, రమేష్, గంజిల్లా నరసింహ, కుంకునూరు నాగరాజు, నల్లన్న, గంగన్న, రమేష్, గోపాల్ పాల్గొన్నారు.

సంబరాలు చేసుకుంటున్న సమతా సైనిక్ దళ్ సభ్యులు

## అందుబాటులోకి పాఠ్య పుస్తకాలు

**ప్రజాశక్తి - ఆదోనిరూరల్**

వేసవి సెలవులు ముగిసిన తర్వాత స్కూళ్ల పునఃప్రారంభం కాగానే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం యాజైన్స్‌లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ముందస్తుగానే సిద్ధం చేసిన పుస్తకాలను నియోజకవర్గ కేంద్రాలకు లారీల ద్వారా తరలిస్తోంది. పట్టణంలోని మున్సిపల్ స్కూల్ కేంద్రానికి 8, 9, 10వ తరగతి విద్యార్థుల పాఠ్య పుస్తకాలు అందాయి. వేసవి సెలవుల్లోనే జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రాలకు పుస్తకాలను తరలించే ఏర్పాట్లలో విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వం పంపిణీ చేసే పాఠ్య పుస్తకాలు చేరవేస్తున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, గురుకుల, మోడల్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో విద్యార్థుల సంఖ్యను అనుగుణంగా పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వమే పాఠ్య పుస్తకాలను ఉచితంగా అందిస్తోంది. 2022-23 విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో సులభంగా రాణించేలా 1 నుంచి 8వ తరగతి వరకు కొత్త పాఠ్య పుస్తకాలు నాన్ లాంగ్వేజ్‌కు సంబంధించి ద్విభాషల్లో ముద్రించారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానుండగా ముందస్తు గానే పాఠ్య పుస్తకాలను ప్రభుత్వం చేరవేస్తోంది. జిల్లా కేంద్రాలకు చేరిన పాఠ్య పుస్తకాలను డిజిఒ ఆదేశాలతో మండల కేంద్రాలకు చేరవేయనున్నారు.

పాఠశాలలకు సెలవులు ప్రకటించగా మే నెలలోనే అన్ని జిల్లా కేంద్రాలకు పాఠ్య పుస్తకాలను చేరవేసే అన్ని మండలాలకు అందించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 2024-2025 విద్య సంవత్సరానికి గాను ప్రభుత్వం సరఫరా చేసే ఈ పాఠ్య పుస్తకాలు ప్రయివేట్ విద్యా సంస్థలతో పాటు పక్కదారి పట్టకుండా చైల్డ్ ఇన్ఫోలో నమోదైన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రత్యేక క్రమసంఖ్య నమోదుతో ఆయా మండలాలకు సరఫరా అవుతున్నాయి. ప్రయివేట్ పాఠశాలలకు అందించే పుస్తకాలపై సేల్ అనే పదం ముద్రించి ఉంటుంది. దాంతో వాటిని సులభంగా గుర్తుపట్టొచ్చు. స్థానిక నియోజకవర్గ కేంద్రం ఎంఆర్‌సి బృందం దగ్గరకు పాఠశాలలకు చేర్చించారు. పదో తరగతి తెలుగు పరిమళం పాఠ్యాంశంలో కర్నూలు జిల్లాలోని అత్యంత ప్రసిద్ధి గాంచిన దేవస్థానం దేవరగట్టు బన్ని ఉత్సవాలతో పాటు, ప్రత్యేక దైవాలు, జటకసనం, శతక మధురమ్మ, జలియన్ వాలా బాగ్, రాజా ధర్మం, కన్యాశులకం, తదితర అంశాలపై పాఠ్యాంశాలుగా చేర్చారు.

పాఠ్యపుస్తకాల వద్ద ఎంఆర్‌సి బృందం

## దాడులను అరికట్టేందుకు కమిటీలు

**- కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని సజ్జల హామీ**

**ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్**

సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో టిడిపి శ్రేణులు వైసిపి కార్యకర్తలపై, నాయకులపై దాడులు చోటుచేసుకుంటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పలుచోట్ల వైసిపి నాయకుల ఇళ్లపై, ఆస్తులపై దాడులు చేస్తున్న ఘటనలు అక్కడక్కడ కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో వైసిపి నాయకులు చేసిన దాడులకు ప్రతీకారంగా మరిన్ని దాడులు పెరిగే అవకాశం ఉన్నాయన్న ఆలోచనలో భాగంగా వైసిపి అధినాయకత్వం దాడుల నుంచి కార్యకర్తలను కాపాడుకునేందుకు తగిన చర్యలు తీసుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు వైసిపి నాయకులు కిందిస్థాయి కార్యకర్తలతో, నాయకులతో టచ్‌లోకి వెళ్తున్నారు. ఎన్నికల నిరాశ నుంచి బయటపడేందుకు వారికి ధైర్యం చెప్పి, అన్ని విధాలుగా అండగా ఉండే దిశగా వివిధ స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. అందులో భాగంగా వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి జిల్లా అధ్యక్షులు, ప్రధాన నాయకులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. దాడుల నుంచి రక్షణ కల్పించేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా తమ పార్టీ కార్యకర్తలపై దాడులు గానీ, ఆస్తి నష్టం గానీ సంభవిస్తే ఆ కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉండేలా కమిటీలను సిద్ధం చేయాలని ఆదేశించారు. అవసరమైతే వారికి ఆర్థికంగానూ, న్యాయపరంగానూ కూడా ఆదుకోవాలని చెప్పినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పార్టీ అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు. జిల్లా అధ్యక్షులు ఈ పనిలోనే వెంటనే దిగి సంబంధిత ఏర్పాట్లకు కృషి చేయాలని ఆదేశించినట్లు సమాచారం.

## సస్పెన్షన్ ఉత్తర్వులు ఎత్తివేయాలి

**- పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య**

**ప్రజాశక్తి - ఆదోని**

గత నెల 13న సార్వత్రిక ఎన్నికల విధులకు హాజరు కాలేకపోయిన ఉపాధ్యాయులపై ఇచ్చిన సస్పెన్షన్ ఉత్తర్వులు వెంటనే ఎత్తివేయాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య పట్టణ అధ్యక్షులు అనిల్ కుమార్, ఆర్థిక కార్యదర్శి కోటన్న డిమాండ్ చేశారు. గురువారం ఆదోనిలోని నెహ్రూ మెమోరియల్ స్కూల్‌లో పట్టణ శాఖ కార్యదర్శి బడుగు బసవరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల విధులకు కేటాయిస్తూ ఉత్తర్వులకు, ఎన్నికల తేదీ నాటికి నెలరోజుల పైగా వ్యవధి ఉందని తెలిపారు. ఉపాధ్యాయులు కొందరు అనారోగ్యం పాలవడం, వివిధ కారణాల చేత శిక్షణ తరగతులకు, ఎన్నికల విధులకు హాజరు కాలేకపోయారని చెప్పారు. ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఉత్తర్వులు వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మహిళా ఉపాధ్యాయులు ఎన్నికల విధి నిర్వహణలో భాగంగా ఎదుర్కొంటున్న సమస్యలను మానవతా దృక్పథంతో ఆలోచించాలని కోరారు. ఎన్నికల విధుల కేటాయింపు, పారితోషకం సౌకర్యాల కల్పన విషయంలో రాష్ట్రం మొత్తం ఒకే విధంగా ఉండేలా భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లోనైనా చర్యలు తీసుకోవాలని కోరారు. అలీం సిద్దిఖ్, రామయ్య, ఒబేదర్ రెహ్మాన్, చంద్ర మౌళి, వెంకటేశ్వర్లు, విజయ్ కుమార్, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

నిరసనలో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

## రాజకీయ భవితవ్యం తలకిందులు

**- నియోజకవర్గంలో పోలింగ్ సరళితో అవాక్కు**

**ప్రజాశక్తి - ఆదోని**

ఎంతో ఉత్కంఠభరితంగా ఎదురు చూసిన సాధారణ ఎన్నికల ప్రక్రియ మే 13న ప్రశాంతంగా ముగియడంతో అధికారులు, నాయకులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈనెల 4న ఎన్నికల ఫలితాలు వెల్లడి కావడంతో అంచనాలు తలకిందులై భవితవ్యం తేలిపోయింది. లక్ష మెజార్టీతో సిట్టింగ్ ఎమ్మెల్యే, వైసిపి అభ్యర్థి సాయిప్రసాద్ రెడ్డి గెలుపొంది హ్యాట్రిక్ సాధిస్తారని అందరూ బావించారు. పోలింగ్ సరళిని పట్టి చూస్తే స్వల్ప మెజార్టీతోనైనా సాయిప్రసాద్ రెడ్డి గెలుస్తారని జోరుగా బెట్టింగులు సాగాయి. అందరి అంచనాలు తలకిందులై కూటమి అభ్యర్థి పార్థసారథి 18 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. నాన్ లోకల్ వారిని ఆదోనివాసులు ఆదరించడం లేదని, 1999లో అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి తనయుడు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డిని మీనాక్షి నాయుడు ఓడించారని ప్రాచుర్యంలో ఉంది. అదే తరహాలో ఫలితాలు ఉంటాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలు మాత్రం పార్థసారథి వైపే ఉన్నట్లు ఫలితాలను బట్టి తేటతెల్లమైంది.

**పోలైన ఓట్ల వివరాలు**

నియోజకవర్గంలో ఎమ్మెల్యే బరిలో నిలిచిన ఆయా పార్టీల అభ్యర్థులకు పోలైన ఓట్ల వివరాలు ఇలా ఉన్నాయి... బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి అయిషా బాను అమీలెకు ఈవిఎం ఓట్లు 2,143, పోస్టల్ ఓట్లు 9, మొత్తం 2,152, శాతం 1.22 నమోదయింది. బిజెపి (కూటమి) అభ్యర్థి డాక్టర్ పార్థసారథి వాల్మీకి ఈవిఎం ఓట్లు 88,943, పోస్టల్ ఓట్లు 986, మొత్తం 89,929, శాతం 51.06గా నమోదయింది. కాంగ్రెస్ అభ్యర్థి జి.రమేష్ యాదవ్‌కు ఈవిఎం ఓట్లు 7,567, పోస్టల్ ఓట్లు 55, మొత్తం 7,622, శాతం 4.33 నమోదయింది. వైసిపి అభ్యర్థి వై.సాయి ప్రసాద్ రెడ్డికి ఈవిఎం ఓట్లు 71,297, పోస్టల్ ఓట్లు 468, మొత్తం 71,765, శాతం 40.74గా నమోదయింది. జైభీం రావ్ భారత్ పార్టీ అభ్యర్థి కె.రంగన్నకు ఈవిఎం ఓట్లు 468, పోస్టల్ ఓట్లు 3, మొత్తం 471, శాతం 0.27 వచ్చింది. స్వతంత్ర అభ్యర్థి ఉరుకుందు వడ్డెకు ఈవిఎం ఓట్లు 139, పోస్టల్ ఓట్లు 1, మొత్తం 140, శాతం 0.08గా నమోదయింది. స్వతంత్ర అభ్యర్థి జి.జయన్నకు ఈవిఎం ఓట్లు 273, పోస్టల్ ఓట్లు 1, మొత్తం 274, శాతం 0.16, స్వతంత్ర అభ్యర్థి కె.దస్తగిరి నాయుడుకు ఈవిఎం ఓట్లు 726, పోస్టల్ ఓట్లు 1, మొత్తం 727, శాతం 0.41 వచ్చింది. స్వతంత్ర అభ్యర్థి బి.నాగరాజుకు ఈవిఎం ఓట్లు 267, పోస్టల్ ఓట్లు 1, మొత్తం 268, శాతం 0.15, స్వతంత్ర అభ్యర్థి జి.యువరాజ్‌కు ఈవిఎం ఓట్లు 1,162, పోస్టల్ ఓట్లు 8, మొత్తం 1,170, శాతం 0.66గా నమోదయింది. నోటా ఈవిఎం ఓట్లు 1,597, పోస్టల్ ఓట్లు 18, మొత్తం 1,615, శాతం 0.92 వచ్చింది. మొత్తం ఈవిఎం ఓట్లు 1,74,582, పోస్టల్ ఓట్లు 1,551, పోలైన మొత్తం ఓట్లు 1,76,133, శాతం 100 పోలైనట్లు అధికారులు వెల్లడించారు.

ఆలయ ప్రాంగణంలో ఉన్న భక్తులు

## రాఘవేంద్రుని సన్నిధిలో భక్తుల సందడి

**ప్రజాశక్తి - మంత్రాలయం**

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో శ్రీమఠంలో సందడి నెలకొంది. గురువారం స్వామి వారి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకునేందుకు బారులు తీరారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బృందావన ప్రతిమను స్వర్ణపల్లకిలో ఉంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో పల్లకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లకి సేవ చేయించిన భక్తులతో పల్లకిని మోయించారు. రథోత్సవ సేవలు చేయించిన భక్తుల సమక్షంలో ఉత్సవ మూర్తి ప్రహ్లాద రాయులను రజత గజారోహణంపై రజత, కొయ్య, స్వర్ణ, నవరత్న, స్వర్ణ రథాలపై ఆశీనులు చేసి శ్రీమఠం ప్రాకారంలో ఊరేగించారు.

## 21వ వార్డులో 645 టిడిపికి మెజార్టీ

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

కేక్ కట్ చేస్తున్న నాయకులు

పట్టణంలోని 21వ వార్డులో బూత్ 103, 104లో 645 మెజారిటీ ఇచ్చిన వార్డు ప్రజలకు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి తరపున వార్డు కౌన్సిలర్ దయాసాగర్, వార్డు అధ్యక్షులు హుస్సేన్ పీరా శుభాకాంక్షలు తెలిపారు. గురువారం వార్డు ప్రజలతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించుకున్నారు. బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కర్నూలు 6వ అదనపు జిల్లా కోర్టులో
A.S.No.34/2023
M. వెంకటరమణ. ...అప్పిలెంటు
V/S
R. చంద్రశేకర్
S/o. R.C. వెంకటస్వామి
D/o No.40-30-19A,
మేడం కాంపౌండు,
పార్కురోడ్డు, కర్నూలు. ...రెస్పాండెంటు

**రెస్పాండెంటుకు అప్పీలు నోటీసు**

పై నెంబర్ అప్పీలులో అప్పిలెంటు, కర్నూలు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జికోర్టు O.S.No.218-2016 6.2.23 తేదిన ఇచ్చిన తీర్పు మేరకు అప్పీలు దాఖలు చేసినారు. ఇందులో రెస్పాండెంటు అయిన నీకు ఆక్షేపణలు ఉన్న 26.6.2024 తేది పగలు 10.30 గం॥లకు పై కోర్టులో హాజరు అయి తెలుపు కోనవలయును. లేని యెడల నీ పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

**(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)**

**వాయిదా : 26-06-2024**

**ఎస్.చాంద్ బాషా,**
అప్పిలెంటు అడ్వకేటు, కర్నూలు.

సమను
మహారాజశ్రీ డోన్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
Summons to Defendants
స్వతహాగా హాజరగుటకు సమ్మను,
సివిల్ ప్రొసిజర్ కోడ్ 5వ ఆర్డర్-3వ విది
O.S.No.288/2023
S.Mahammad Rafi. ...అర్జిదారు
Vs
A.Suryaprakash Rao,
Age : 48 yrs, S/o Peelaiah,
Hindu, Business, R/o Alamkonda (V),
Krishnagiri (M), Kurnool (Dist). ...రెస్పాండెంట్

మీ పై డిక్రీ నిమిత్తము మీ మీద వాజ్యాము తెచ్చినందువలన సదరు దావాకు ప్రత్యుత్తరము చెప్పుటకు 25-06-2024 తారీఖున పగలు 10-30 గంటలకు మీరు స్వతహాగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టు నందు హాజరు అయ్యేటట్టు ఇందు వలన మీకు ఆజ్ఞాపించడమైనది. మీ ప్రతి వాదనకు ఆధారంగా మీరు నమ్మకమునకు ఉద్దేశించి యుండే దస్తావేజులన్నింటిని ఆరోజున హాజరుపర్చుటకు మీకు ఉత్తర్వు చేయడమైనది.

పైన చెప్పబడిన దినమందు మీరు హాజరు కాకుండా తప్పిపోయే ఎడల మీ పరోక్షమందు ఆ వ్యాజ్యామును విమర్శవేసి తీర్మానించడమవునని మీరు తెలుపుకోవలసినది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది : 25-06-2024

S.T.Haroon,
Advocate,
Dhone, Nandyal Dist.
Cell : 9440534001

## సేవలకు గుర్తింపు

**- టిడిపి జిల్లా పార్లమెంట్ మెంట్ కార్యనిర్వాహక కార్యదర్శిగా రామదాసు గౌడ్**

**ప్రజాశక్తి- దేవనకొండ**

టిడిపి జిల్లా పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శిగా మండలంలోని గుండ్లకొండ గ్రామానికి చెందిన టిడిపి నాయకులు, బీసీ సామాజిక వర్గానికి చెందిన ఈ.రాందాస్ గౌడ్‌ను ఎన్నుకున్నట్లు టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం రాందాస్ గౌడ్ విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో టిడిపి అభివృద్ధికి, బలోపేతానికి చేసిన కృషికి, సేవలకు గుర్తించి తనకు ఆ పదవి ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. టిడిపి అధిష్టానం ఇచ్చిన పదవికి కట్టుబడిగా పనిచేసి పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు. తనకు పదవి ఇచ్చిన టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్, టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, టిడిపి పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా రాజేశ్వరరావు జయంతి

**ప్రజాశక్తి - ఆదోని**

స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రత్యేక పాత్ర పోషించిన చంద్ర రాజేశ్వరరావు జయంతి సందర్భంగా గురువారం ఆదోనిలోని సిపిఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్‌బాబు మాట్లాడుతూ... ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు కె.లక్ష్మి రెడ్డి, సిపిఐ, పట్టణ మండల కార్యదర్శులు సుదర్శన్, కల్లుబావిరాజు, హుసేని, ఎల్లప్ప, మెకానిక్ వలీ, సూరి పాల్గొన్నారు.

## 'వేరుశనగ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి'

**ప్రజాశక్తి - పత్తికొండ**

రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని చక్రాల ఎంపిటిసి బోయ రాజు కోరారు. గురువారం మండలంలోని చక్రాల గ్రామంలోని రైతు భరోసా కేంద్రం అధికారులు వేరుశనగ విత్తన పంపిణీ చేపట్టారు. టిడిపి యువ నాయకులు ముని నాయుడు, మొట్టి రమేష్, మొట్టి శ్రీనివాసులు, పులికొండ లోకన్న, చిన్న మునిస్వామి, మధు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై గళమెత్తుతాం

**- కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్**

**ప్రజాశక్తి - ఆదోని**

ఆదోని నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని గళమెత్తుతామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్, సిపిఐ సీనియర్ నాయకులు అజయ్ బాబు, సిపిఎం పట్టణ నాయకులు తిప్పన తెలిపారు. గురువారం ఆదోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతనెల 13న జరిగిన పోలింగ్‌లో ప్రజలు ఇండియా వేదిక పట్ల నమ్మకముంచి సుమారు 8 వేల ఓట్లు వేశారని తెలిపారు. సమయం తక్కువ ఉండడం వల్ల అనుకున్నంత స్థాయిలో ప్రచారం చేయలేకపోయామని చెప్పారు. భవిష్యత్తులో మరింత పట్టుదలతో పార్టీ బలోపేతానికి కృషి చేసి ఎన్నికల్లో విజయం సాధించే దిశగా ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఇండియా వేదిక తరపున అభ్యర్థులను పోటీలో దింపుతామన్నారు. నియోజకవర్గంలో తాగు, సాగునీటికి సంబంధించిన ప్రాజెక్టులు పూర్తి చేయాలని పాలకులపై ఒత్తిడి తెస్తామని తెలిపారు. ఆదోని పట్టణంలో రోడ్ల వెడల్పు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం, రోడ్ల మరమ్మతులు, పబ్లిక్ టాయిలెట్ల ఏర్పాటు వంటి వాటిపై గళమెత్తుతూనే ఉంటామని చెప్పారు. బిజెపి అభ్యర్థి పార్థసారథిని ప్రజలు ఆదరించి సుమారు 18 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించారని తెలిపారు. కక్ష సాధింపులు కాకుండా ఆదోని అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయించాలని కోరారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన పార్థసారథికి ఎమ్మెల్యేగా అవకాశం వచ్చిందని, ప్రజలకు మెరుగైన సేవలు అందించి అందరి మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. సిపిఎం పట్టణ నాయకులు తిప్పన మాట్లాడుతూ... సమస్యలు పరిష్కరించాలని అడిగిన ఉద్యోగులపై కేసులు బనాయించి ఉద్యమంపై ఉక్కు పాదం మోపిన జగన్మోహన్ రెడ్డికి తగిన గుణపాఠం చెప్పారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు దిలీప్, మారుతి రావు, సాయినాథ్, దేవిశెట్టి వీరేష్, బండారి తాయన్న, రామకృష్ణారెడ్డి, హుస్సేనప్ప యాదవ్, వంశీ, ప్రశాంత్, సిపిఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్, మండల కార్యదర్శి కల్లుబావి రాజు, సిపిఎం పట్టణ నాయకులు కృష్ణమూర్తి ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రమేష్ యాదవ్

## భక్తులతో కిటకిటలాడిన పుణ్యక్షేత్రాలు

**ప్రజాశక్తి - కౌతాళం**

ఉరుకుందలో ఉన్న భక్తులు

మండలంలో వెలసిన శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి, శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి పుణ్యక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. గురువారం అమావాస్య కావడంతో దేవాలయాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. బుధవారం రాత్రి భక్తులు ఉరుకుంద క్షేత్రానికి చేరుకొని ఉదయం తెల్లవారుజాము నుంచి స్వామి వారి దర్శనం కోసం బారులు తీరారు. కొంతమంది భక్తులు తలనీలాలు సమర్పించారు. భక్తులకు ఇలాంటి ఇబ్బందులూ కలుగకుండా డిప్యూటీ కమిషనర్ వెంకటేష్, పాలకమండలి సభ్యులు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పూజలు నిర్వహించారు. దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నా పాషా భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా సౌకర్యాలు కల్పించారు.

## పురాతన బావిని కాపాడాలి

**- తహశీల్దార్‌కు వినతి**

**ప్రజాశక్తి - హోళగుంద**

గ్రామ శివారులోని అగ్రహారం ఆంజనేయ స్వామి దేవాలయానికి సంబంధించిన పురాతన మెట్ల బావిని కాపాడాలని దేవాలయం మాజీ ధర్మకర్త సింధూలం కృష్ణయ్య, టిడిపి మండల మాజీ కన్వీనర్ వీరన్న గౌడ్, పూజారి పవన్ కుమార్, దిద్ది తిక్క స్వామి, వెంకటేష్, కోగిల తోట రంగప్ప కోరారు. గురువారం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అగ్రహారం ఆంజనేయ స్వామి దేవాలయానికి సంబంధించిన సర్వే నెంబర్ 657/బిలో 1.35 సెంట్ల భూమి ఉందన్నారు. అక్కడ పురాతన మెట్ల బావిని కొందరు రాత్రికి రాత్రే జెసిబిల ద్వారా మట్టితో పూడ్చేశారని తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి దేవాలయానికి సంబంధించిన భూమిని సర్వే చేసి, మెట్ల బావిని పరిరక్షించాలని కోరారు. అనంతరం తహశీల్దార్ ఎఎన్.ప్రసాద్ రాజుకు వినతిపత్రం అందజేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ... రెండు రోజుల్లో దేవాలయానికి సంబంధించిన భూమిని సర్వే చేయిస్తామని తెలిపారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు




మాట్లాడుతున్న జనసేన ఇన్‌ఛార్జీ లక్ష్మన్న

## కింగ్ మేకర్‌గా పవన్ కల్యాణ్

**- జనసేన ఇన్‌ఛార్జీ లక్ష్మన్న**

**ప్రజాశక్తి - మంత్రాలయం**

దేశంలో కింగ్ మేకర్‌గా జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ నిలిచారని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బి.లక్ష్మన్న పేర్కొన్నారు. గురువారం స్థానికంగా ఉన్న ఆయన స్వగృహంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పవన్ కల్యాణ్ జీరో స్థాయి నుంచి మొదలుపెట్టి నేడు రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ, కింగ్ మేకర్‌గా అవతరించి రాష్ట్ర రాజకీయాలను, దేశ రాజకీయాలను ప్రభావితం చేసే స్థాయికి ఎదిగారని కొనియాడారు. జనసేన పార్టీకి ఇచ్చిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను 100 శాతం గెలిపించుకున్నారని తెలిపారు. పిఠాపురంలో కూడా 70 వేలకు పైగా మెజార్టీతో గెలుపొంది చేసిన శపథం నిలబెట్టుకున్నారని చెప్పారు. పవన్ కల్యాణ్‌ను అవహేళన చేసిన వారిని చులకనగా మాట్లాడిన వారికి అభివృద్ధితో బుద్ధి చెబుదామని చెప్పడం ఆయన పెద్ద మనసుకు నిదర్శనమని తెలిపారు. చంద్రబాబుతో కలిసి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నారని, కేంద్ర సహాయంతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జన సైనికులు బీవీ.రవిచంద్ర, ప్రకాష్, రాజశేఖర్, ఖాజా, నరసింహ పాల్గొన్నారు.

**తలసేమియా వ్యాధితో బాధపడుతున్న**

## చిన్నారికి రక్తదానం

**ప్రజాశక్తి-ఆదోనిరూరల్**

రక్తదానం చేస్తున్న బండి మల్లికార్జున

పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి రక్తదానం చేశారు. చిన్నారి శైలజకు రక్తం అవసరం కావడంతో జనసేవ సామాజిక సేవ సంస్థ వారికి తెలియజేయగా ఫోన్ ద్వారా పెద్దహరివాణం గ్రామానికి చెందిన బండి మల్లికార్జున స్పందించి హుటాహుటిన ఆస్పత్రికి చేరుకుని రక్తదానం చేశారు. గురువారం బండి మల్లికార్జున మాట్లాడారు. అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదని, ఇప్పటికే తాను 9వ సార్లు రక్తదానం చేశానని తెలిపారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ రక్తదానం చేయడంలో గొప్పతనం ఉందన్నారు. రక్తదానం చేసిన దాతకు కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జనసేవ సామాజిక సేవ సంస్థ సభ్యులు విరుపాక్షి స్వామి పాల్గొన్నారు.

**Before The Andhra Pradesh Co-operative Tribunal Court at Vijayawada**
**MP No 21/2024 in SR No 56/24**
Between
M.Radha @ Anuradhamma ...Appellant
And
Assistant Registrar/Arbitrator O/o Sub Divisional Co-op officer and 11 others
...Respondants

**Respondant No.3:-** IVth Class Employees Housing Society R/o. H.No.49/50A-22B, Pala Kottla, Madduru Subba Reddy Nagar, Kurnool City, Kurnool District-518002. Rep by its Chief Executive Officer/Secretary

**Respondant No.11:-** Cheduvula Gopala Krishna, S/o C.Seshaiah, aged about 60 years, Ex-President of IVth Class Employees Housing Society R/o. H.No.49/50A-22B, Pala Kottla, Madduru Subba Reddy Nagar, Kurnool City, Kurnool District-518002.

**Respondant No.12:-** G.Bala Narasimhulu Director/Ex-President, Govt.Class IV Empls, EHBS Ltd, Kurnool, Kurnool District, Pin-518001.

పై నెంబరు పిటీషనులో 3, 11, 12 రెస్పాండెంట్స్ అయిన మీకు పై పిటీషను నోటీసులు పంపగా తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పేపరు ప్రకటన ద్వారా సదరు పిటీషను సంగతులు తెలియచేయవలసినదిగా శ్రీకోర్టు వారు ఆదేశించి యున్నారు. కావున ది.19-06-2024వ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు పై కోర్టువారి ఎదుట స్వయముగా గాని లేదా మీ న్యాయవాది ద్వారా గాని హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలుపుకొనవలెను లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరని ఇందు మూలముగా తెలియచేయడమైనది.

**(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)**
వాయిదా:ది. 19-06-2024
విజయవాడ,
30-05-2024

**B.Surya Narayana Kumar,**
**Advocate,**
**Moghalrajpuram, Vijayawada-520010,**
**Cell:9848017859, 0866-7968788**

కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

# మంత్రి పదవులు దక్కేదెవరికి..?

- ఉమ్మడి జిల్లాలో ఇద్దరికి ఇచ్చే అవకాశం
- రేసులో పలువురు ఎమ్మెల్యేలు

**ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి**

**రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి కూటమి ఊహించని రీతిలో సీట్లు సాధించింది. త్వరలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటు కానుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి మంత్రి పదవులు ఎవరికి దక్కుతాయోనన్న ఉత్కంఠ నెలకొంది. మంత్రి పదవి కోసం పలువురు ఎమ్మెల్యేలు రేసులో ఉన్నారు...**

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా టిడిపి కూటమి ఊహించని స్థాయిల్లో సీట్లను దక్కించుకుంది. 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో టిడిపి అభ్యర్థులు, ఒక చోట బిజెపి అభ్యర్థి గెలుపొందారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటు కానుంది. దీంతో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి గెలుపొందిన కూటమి అభ్యర్థుల్లో ఎవరికి మంత్రి పదవులు దక్కుతాయోనన్న ఉత్కంఠ నెలకొంది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఇద్దరికి మంత్రి పదవులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గెలుపొందిన ఎమ్మెల్యేల్లో ఎక్కువ మంది మంత్రి పదవిని ఆశిస్తున్నారు. డోన్‌లో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మీద కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి విజయం సాధించారు. కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి మూడు సార్లు కర్నూలు ఎంపీగా ఎన్నికయ్యారు. 1991లో తొలిసారి ఎంపీగా విజయం సాధించారు. మళ్లీ 2004లో, 2009లో కర్నూలు ఎంపీగా విజయం సాధించారు. 2012 నుంచి కేంద్ర రైల్వే సహాయ మంత్రిగా పని చేశారు. ఎంపీగా రాజకీయ అనుభవం ఉన్న ఆయన తొలిసారి శాసనసభలో అడుగు పెడుతున్నారు. సీనియర్ నాయకులు కావడంతో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి మంత్రి పదవి కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బనగానపల్లె నుంచి బిసి జనార్ధన్ రెడ్డి రెండో సారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందినా ఆయనకు మంత్రి పదవి దక్కలేదు. వైసిపి ప్రభుత్వంలో ఆయన జైలుకు కూడా వెళ్లి వచ్చారు. టిడిపి కోసం బాగా కష్టపడి పని చేశారన్న అభిప్రాయం పార్టీ అధిష్టానంలో ఉండటంతో ఆయనకు మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. నంద్యాల నుంచి గెలుపొందిన ఎన్ఎండి ఫరూక్ కూడా మంత్రి పదవి రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన

నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎమ్మెల్సీగా ఎన్నికై మండలి ఛైర్మన్‌గాను, మంత్రిగాను పని చేశారు. ఎన్‌టిఆర్ ప్రభుత్వం నుంచి ఆయన టిడిపిలోనే ఉండటం, రాజకీయ అనుభవం ఉండటంతో ఆయనకు మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఆళ్లగడ్డ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన అఖిలప్రియ కూడా మంత్రి పదవి రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ఆమె గతంలోనూ ఎమ్మెల్యేగా ఎన్నికై పర్యాటక శాఖ మంత్రిగా పని చేశారు. పాణ్యం నియోజకవర్గం నుంచి గెలుపొందిన గౌరు చరిత రెడ్డి కూడా మంత్రి పదవి రేసులో ఉన్నట్లు సమాచారం. ఆరు సార్లు ఎమ్మెల్యేగా పని చేసిన కాటసాని రాంభూపాల్ రెడ్డిపై ఆమె భారీ మెజార్టీతో విజయం సాధించడంతో ఆమెకు మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కర్నూలు జిల్లా నుంచి మంత్రి పదవి రేసులో కర్నూలు ఎమ్మెల్యే టిజి భరత్, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బివి జయనాగేశ్వరరెడ్డి ఉన్నట్లు సమాచారం. కర్నూలు నుంచి టిజి భరత్ రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇంతియాజ్‌పై గెలుపొందారు. యువకులకు అవకాశం ఇస్తే బాగుంటుందనే ఉద్దేశంతో భరత్‌కు మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎమ్మిగనూరు నుంచి బివి జయనాగేశ్వరరెడ్డి మాజీ ఎంపీ బుట్టా రేణుకపై గెలుపొందారు. జయనాగేశ్వరరెడ్డి తండ్రి బివి మోహన్ రెడ్డి చంద్రబాబుకు సన్నిహితుడు కావడం, ముందు నుంచి బివి కుటుంబం టిడిపిలోనే పని చేస్తుండటం, గతంలో జయనాగేశ్వరరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచినా మంత్రి పదవి ఇవ్వలేక పోవడంతో ఈ సారి ఆయనకు మంత్రి పదవి ఇవ్వాలని అదిష్టానం యోచిస్తున్నట్లు సమాచారం. అయితే ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ఎవరెవరికి మంత్రి పదవులు దక్కుతాయో అనేది ఆ పార్టీ అధికారికంగా ప్రకటించే వరకూ వేచి చూడాల్సిందే.

## మల్లన్న హుండీ కానుకలు లెక్కింపు

**ప్రజాశక్తి - శ్రీశైలం**

శ్రీశైలం దేవస్థానానికి వచ్చిన భక్తులు గత 28 రోజులలో హుండీలలో చెల్లించుకున్న కానుకలను గురువారం లెక్కించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఇఒ పెద్దిరాజు మాట్లాడుతూ హుండీ కానుకల లెక్కింపు ద్వారా దేవస్థానానికి రూ.4 కోట్ల 4 లక్షల 21 వేల 906లు నగదు లభించిందన్నారు. అలాగే 332.500 గ్రాముల బంగారం, 5 కేజీల 760 గ్రాముల వెండి లభించాయని చెప్పారు. అలాగే 1768 యుఎస్ఏ డాలర్లు, 45 యూఏఈ దిర్హమ్స్, 1 ఖతార్ రియాల్స్, 5 కెనడా డాలర్స్, 10 ఈరోస్, 50 యూకె పౌండ్సు, 55 ఆస్ట్రేలియా డాలర్లు, మలేషియా రింగిట్స్, 109 సింగపూరు డాలర్లు మొదలైన విదేశీ కరెన్సీ కూడా లభించినట్లు తెలిపారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేపట్టామన్నారు. కార్యక్రమములో డిప్యూటీ కార్యనిర్వహణాధికారిణి రవణమ్మ, పలువురు శాఖాధిపతులు, ఆయా విభాగాల పర్యవేక్షకులు, సిబ్బంది, శివసేవకులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి : సిఐటియు

**ప్రజాశక్తి - వేతంచర్ల**

మున్సిపల్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించి, పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు వైబి వెంకటేశ్వర్లు, వై.ఎల్లయ్య డిమాండ్ చేశారు. గురువారం బేతంచెర్లలోని సిఐటియు కార్యాలయంలో నగర పంచాయతీ కార్మికుల విస్తృత స్థాయి సమావేశం నాయకులు రంగడు, వాటర్‌మాన్ ఎల్లయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బేతంచెర్ల నగర పంచాయతీ కార్మికులకు జీతాలు పెండింగ్లో ఉంచడమే కాకుండా, పని భారం పెంచారని, ఇది ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వలన కార్మికుల జీవితాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు ఉన్నాయని చెప్పారు. కార్మికులకు ఎల్లప్పుడూ సిఐటియు అండగా ఉంటుందన్నారు. అనంతరం మున్సిపల్ కార్మికుల మండల నూతన కమిటీ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై ఎల్లయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష కార్యదర్శులుగా రంగడు, ముత్యాల ఎల్లయ్య (రాజు), ఉపాధ్యక్షులుగా జలీల్, నాగరాజు, భీమన్న, కార్యదర్శులుగా లక్ష్మమ్మ, భాగ్యమ్మ, రామాంజనేయులు, నాగమణి, నాగరాజు, పద్మావతి తదితరులను ఎన్నుకున్నారు.

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు

# ఉప్పొంగిన వాగులు, వంకలు

- రాజోలి ఆనకట్టపై ప్రవహించిన వరద నీరు
- గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- మిడుతూరులో కొట్టుకుపోయిన గడ్డివాము, కారు, కూలిన ఇల్లు
- నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య పర్యటన
- రెండు మండలాలు మినహా జిల్లా అంతటా విస్తారంగా వర్షం

**ప్రజాశక్తి - విలేకరులు**

**నంద్యాల జిల్లాలో బుధవారం రాత్రి నుండి గురువారం తెల్లవారుజాము వరకూ కురిసిన వర్షానికి వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. జిల్లాలో కుంటలు నిండి జలకళ సంతరించుకున్నాయి. చాగలమర్రి మండలంలోని రాజోలి ఆనకట్టపై వరద నీరు ప్రవహించింది. మిడుతూరు మండల కేంద్రంలో ఉన్న కాకిలేరు వాగు ఉప్పొంగి ప్రవహించడంతో వరద నీరు గ్రామంలోకి చేరుకుంది. నీటి ఉధృతికి ఇంటి ముందు ఆపిన కారు కొంత దూరం కొట్టుకుపోయింది. బనగానపల్లె మండలంలోని పాతపాడు గ్రామ సమీపంలో నిర్మించిన పార్కులేషన్ ట్యాంక్ భారీ వర్షాలకు తెగిపోయింది. సంజామల, బేతంచెర్ల, కోవెలకుంట్ల, నందికొట్కూరు మండలాల్లో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.**

**నంద్యాల కలెక్టరేట్ :** జిల్లాలో బుధవారం రాత్రి నుండి గురువారం తెల్లవారుజాము వరకూ విస్తారంగా వర్షం కురిసింది. అక్కడక్కడా కుంటలు నిండటంతోపాటు వంకలు, వాగులు పొంగి పొర్లాయి. కుందూ నదిలోకి వరద నీరు ప్రవేశించడంతో ఉధృతి పెరిగింది. అలాగే నంద్యాల పట్టణంలో రోడ్లపై వర్షపు నీరు ప్రవహించింది. జిల్లాలో బేతంచెర్ల మండలంలో అత్యధికంగా 94.2 మి.మీ, అత్యల్పంగా పగిడ్యాల మండలంలో 2.4 మి.మీ వర్షపాతం నమోదయింది. అలాగే సంజామల మండలంలో 93.0, పాణ్యం 66.8, బండి ఆత్మకూరు 64.8, డోన్ 49.2, గోస్పాడు 39.2, అవుకు 33.4, బనగానపల్లె 33.3, నందికొట్కూరు 32.4, కొలిమిగుండ్ల 31.8, దొర్నిపాడు 26.6, మిడ్తూరు 26.4, సిరివెళ్ల 20.0, కోయిలకుంట్ల 20.0, మహానంది 19.2, ఆత్మకూరు 17.8, గడివేముల 16.8, నంద్యాల 12.8, వెలుగోడు 10.2, జూపాడుబంగ్లా 8.8, ప్యాపిలి 7.8, ఆళ్లగడ్డ 6.8, చాగలమర్రి 5.0, శ్రీశైలం 4.8, ఉయ్యాలవాడ 4.0, పాములపాడు 2.8 మి.మీ వర్షపాతం నమోదయింది. కొత్తపల్లె, రుద్రవరం మండలాల్లో వర్షం కురవ లేదు.

**రాజోలి ఆనకట్టపై ప్రవహించిన వరద నీరు**

**చాగలమర్రి :** మండలంలోని రాజోలి ఆనకట్టపై గురువారం వరద నీరు పొంగి ప్రవహించింది. జిల్లాలో ఎగువన కురిసిన వరద నీరు ఆనకట్టకు చేరింది. ఆనకట్టపై పొంగి ప్రవహించినట్లు కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. ఆనకట్ట వద్దగల గేట్లను ఎత్తి కడప జిల్లా వైపు గల కుందూకు నీటిని విడుదల చేశామని చెప్పారు. కుందూలో 4 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని తెలిపారు. నెల రోజుల నుంచి నీరు లేక ఒట్టిపోయిన రాజోలి ఆనకట్ట వద్ద వరద నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. పరిసర గ్రామాల రైతులు, కూలీలు, మూగ జీవాలకు దాహం తీరినట్లైంది.

**మిడుతూరులో కొట్టుకుపోయిన కారు, గడ్డివాము**

**- పర్యటించిన నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య**

**మిడుతూరు :** మిడుతూరు మండలంలోని కలమందలపాడు, ఉప్పల్‌దడి, చౌట్కూరు, కడుమూరు, పై పాలెం, నాగలూటి, పీరుసాహెబ్ పేట గ్రామాల్లో గత రాత్రి కురిసిన వర్షానికి కాకిలేరు వాగు ఉప్పొంగి ప్రవహించింది. దీంతో వరద నీరంతా మిడుతూరు మండల కేంద్రంలోని ఎస్‌సి కాలనీలోకి అధికంగా చేరుకుంది. దీంతో ఓ రైతుకు చెందిన గడ్డివాము, రాజు అనే వ్యక్తి ఇంటి ముందు ఆపిన కారు నీటిలో కొద్ది దూరం వరకూ కొట్టుకుపోయాయి. స్థానికులు గమనించి వెంటనే తాళ్ల సహాయంతో కారుని ఒడ్డుకు చేర్చారు. అలాగే ఎస్సీ కాలనీలో దాదాపు 100 ఇళ్లలోకి నీళ్లు చేరాయి. ఇళ్లలో ధాన్యం తడిసిపోవడంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గతంలో 2007లో కూడా కాకిలేరు వాగు ఉప్పొంగి ప్రవహించడంతో ఇలాగే ఇబ్బందులు పడ్డామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కాకిలేరు వాగు నీటి ప్రవాహంతో మిడుతూరు నుండి దేవనూరు, చింతలపల్లి, చౌటుకూరు, బన్నూరు (మిగతా 6వ పేజీలో..)

మిడుతూరులో వరద నీటికి కొట్టుకుపోతున్న కారును తాళ్లతో కట్టి ఒడ్డుకు చేర్చుతున్న స్థానికులు

చాగలమర్రి : రాజోలి వద్ద ప్రవహిస్తున్న వరద నీరు

చంద్రబాబును కలిసిన భూమా అఖిలప్రియ

## టిడిపి అధినేత చంద్రబాబుని కలిసిన ఎమ్మెల్యే అఖిలప్రియ

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

టిడిపి అధినేత, కాబోయే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గురువారం ఉండవల్లిలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. మరోసారి ముఖ్యమంత్రి కాబోతున్న సందర్భంగా చంద్రబాబుకు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో మంచి మెజార్టీతో గెలుపొందినందుకు అఖిలప్రియను చంద్రబాబు అభినందించారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడాలని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగాలని భూమా అఖిలప్రియకు చంద్రబాబు సూచించారు.

## కాల్వల్లో చెత్తాచెదారాన్ని తొలగించాలి : కమిషనర్

**ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్**

కాలువలలో వర్షపు నీరు, మురుగు నీరు నిలవకుండా చెత్తాచెదారాన్ని తొలగించాలని నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్ టి సుధాకర్ రెడ్డి పారిశుధ్య కార్మికులకు ఆదేశించారు. నందికొట్కూరు పట్టణంలో బుధవారం కురిసిన భారీ వర్షాలకు పట్టణంలోని హాజి నగర్, మారుతి నగర్, హాస్పిటల్ రోడ్డు తదితర పరిసర ప్రాంతాలు వర్షపు నీటితో జలమయమయ్యాయి. గురువారం పట్టణంలోని పలు ప్రాంతాలను కమిషనర్ పరిశీలించారు. కాలువలు చెత్తాచెదారంతో నిండకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పరిశుద్ధ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ టి సుధాకర్ రెడ్డి

## బిసి ఇందిర, బిసి రాజారెడ్డిలకు అభినందనల వెల్లువ

**ప్రజాశక్తి - బనగానపల్లె**

మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, పట్టణానికి చెందిన మహిళలు, టిడిపి కార్యకర్తలు, నాయకులు బిసి జనార్దన్ రెడ్డి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించడంతో ఎమ్మెల్యే బిసి సతీమణి బిసి ఇందిరా రెడ్డి, పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డిలను గురువారం కలిసి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కేకును కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. టిడిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, ముస్లిం మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రాయలసీమ సలాం, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి పక్కూర్ బి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు తరలివచ్చి పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బిసి ఇందిరా రెడ్డి, బిసి రాజా రెడ్డిలు మాట్లాడుతూ బిసి జనార్దన్ రెడ్డిని అఖండ మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిపించినందున ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లాయర్ నాగేంద్ర రెడ్డి, ఇల్లూరు కొత్తపేట మల్లారెడ్డి, యాగంటి పల్లె తపాల పెద్ద దస్తగిరి, ఖాదర్, మీరాపురం బాలి రెడ్డి, భాస్కర్ రెడ్డి, పాతపాడు కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, తెలుగుపేట యూత్ సభ్యులు, ముస్లిం మహిళలు పాల్గొన్నారు.

బిసి ఇందిరాను అభినందిస్తున్న టిడిపి నాయకులు కార్యకర్తలు

మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డిని అభినందిస్తున్న టిడిపి నాయకులు కార్యకర్తలు మహిళలు

## జగన్ అరాచక పాలనకు చరమగీతం పాడారు

**- సాగు, తాగు నీటికి ప్రాధాన్యత : బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి**

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

రాష్టంలో జగన్ మోహన్ రెడ్డి అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడారని టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం నంద్యాలలోని టిడిపి ఎంపీ బైరెడ్డి శబరి ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరితోపాటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలల్లో టీడీపి అభ్యర్థులను ప్రజలు గెలిపించినందుకు ఆయన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలో వైసీపీ నాయకులు ఐదేళ్ల కాలంలో రౌడీయిజాన్ని పోషించారాని, డబ్బు సంచులతో ఇక్కడికి వచ్చి గొడవలు సృష్టించాలని చూస్తే ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. నంద్యాలకు చరిత్ర ఉందని, అలాంటి నంద్యాల పవిత్రతను చెడగొట్టాలని చూస్తే సహించేది లేదన్నారు. వ్యాపారులకు, ప్రజలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. నంద్యాలలో రౌడీలను వదలిపెట్టేది లేదని, క్రిమినల్ కేసులు నమోదు చేయించి జైల్లో పెట్టిస్తామని పరోక్షంగా రౌడీ షీటర్లను హెచ్చరించారు. ప్రభుత్వం కొలువయ్యాక జిల్లాలో ప్రధానంగా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు.

మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

## శ్రీశైలంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి దంపతులు

**ప్రజాశక్తి - శ్రీశైలం**

శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను శ్రీశైలం ఎమ్మెల్యేగా గెలుపొందిన బుడ్డా రాజశేఖర్ రెడ్డి దంపతులు గురువారం దర్శించుకున్నారు. స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఎమ్మెల్యే దంపతులు ఆలయ రాజగోపురం వద్దకు రాగానే దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు, ఏఈవో హరిదాస్, ఏఈవో మోహన్, అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులు స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన వంటి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈవో శేష వస్త్రం, లడ్డూ ప్రసాదాలు, చిత్రపటంతో ఎమ్మెల్యే దంపతులను సత్కరించారు. అర్చకులు, వేదపండితులు తీర్థప్రసాదాలు ఇచ్చి ఆశీర్వదించారు.

**శిఖరం వద్ద ఎమ్మెల్యేకు కూటమి నాయకులు స్వాగతం**

శ్రీశైలం నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలుపొందిన బుడ్డా రాజశేఖర్ రెడ్డికి కూటమి నాయకులు శిఖరం వద్ద ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.శ్రీనివాసరెడ్డి, విపిఎ బెంజిమెన్, రమణ, బ్రహ్మానందరెడ్డి, వడ్డేటి వెంకట రమణ, రౌతు అశోక్, కార్యకర్తలు ఆర్పీ అరవింద్ సింగ్, దుర్గా, దారివేముల శ్రీనివాస్, మురళి తదితరులు పాల్గొన్నారు.



స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అధికారులు



ఎమ్మెల్యే దంపతులకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

## మోడల్ స్కూల్ మిగులు సీట్లకు 13న ప్రవేశ పరీక్ష

**ప్రజాశక్తి - పగిడ్యాల**

మోడల్ స్కూల్లో 6, 7, 8వ తరగతులకు మిగిలిన సీట్లకు ప్రవేశ పరీక్ష ఈ నెల 13న నిర్వహిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుజన గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మోడల్ స్కూల్లో చదవాలనుకున్న విద్యార్థులు 6,7,8 తరగతులకు మిగిలిన సీట్లకు ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 13వ తేదీన పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మాజీ జెడ్పిటిసి ఎర్రబోతుల ఉదయ భాస్కర్ రెడ్డి అరెస్ట్

**ప్రజాశక్తి - కొలిమిగుండ్ల**

మండలంలోని పెట్నికోట గ్రామంలో గత నెల 13న జరిగిన ఎన్నికల గొడవల్లో భాగంగా మాజీ జడ్పిటిసి ఎర్రబోతుల ఉదయభాస్కర్ రెడ్డిని ఆళ్లగడ్డలో ఆళ్లగడ్డ డిఎస్పి షర్ఫుద్దీన్ ఆధ్వర్యంలో అరెస్టు చేసినట్లు పోలీసులు గురువారం తెలిపారు. మాజీ జెడ్పిటిసిని ఆళ్లగడ్డలో అరెస్టు చేసి కోవెలకుంట్ల కోర్టుకు తరలించగా జడ్జి రిమాండ్ విధించగా ఆళ్లగడ్డ సబ్ జైలుకి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

## ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

**ప్రజాశక్తి - పగిడ్యాల**

పగిడ్యాల గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగిసిందని గ్రంథాలయ అధికారిణి కె.మద్దమ్మ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాదాపు నెల రోజులు నుంచి పగిడ్యాల గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించామని, విద్యార్థులకు వివిధ రకాల నీతి కథలను చదివించి వాటిలో ఉన్న నీతిని వివరించామన్నారు. అలాగే విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్‌ను నేర్పించామని తెలిపారు. వివిధ రకాల పాటల పోటీలను నిర్వహించినట్లు చెప్పారు. కలర్ పేపర్లతో వివిధ రకాల బొమ్మలను డిజైన్లను విద్యార్థులచే తయారు చేయించామన్నారు. ఆటల పోటీలలో విజేతలకు బహుమతులను పంపిణీ చేశామన్నారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయానికి వచ్చి వివిధ రకాల పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలని కోరారు.

వివిధ రకాల ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న మద్దమ్మ

ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బిసి

## చంద్రబాబు, లోకేష్‌లను కలిసిన బిసి

**ప్రజాశక్తి - బనగానపల్లె**

బనగానపల్లె ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడును, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబులను గురువారం ఉండవల్లిలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. బనగానపల్లె నియోజకవర్గంలో మంచి మెజార్టీతో గెలుపొందినందుకు బిసి జనార్ధన్ రెడ్డిని చంద్రబాబు నాయుడు అభినందించారు. రాబోయే కాలంలో మంచి భవిష్యత్తు ఉందని కొనియాడినట్లు బిసి తెలిపారు.

## బిసిజి టీకా తప్పనిసరి

**ప్రజాశక్తి - చాగలమర్రి**

టీబీ నివారణకు బీసీజీ టీకా తప్పనిసరిగా వేయించుకోవాలని చాగలమర్రి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఇమ్రాన్ అన్నారు. గురువారం చాగలమర్రి పట్టణంలోని సచివాలయాలలో వైద్య సిబ్బంది టీకాలు వేస్తున్న కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 870 మందికి బిసిజీ టీకాలు వేసామన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ రామలింగారెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

## టిడిపి విజయోత్సవ సంబరాలు

**ప్రజాశక్తి - మహానంది**

మహానంది మండలం నందిపల్లె గ్రామంలో గురువారం స్థానిక హజరత్ మదార్ వలి స్వామి దర్గా, వీరభద్ర స్వామి దేవాలయంలో టిడిపి అఖండ విజయాన్ని పురస్కరించుకొని స్థానిక నాయకులు పూజలు చేశారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి విజయం సందర్భంగా కేక్ కట్ చేశారు. నాయకులు మహేశ్వర్ రెడ్డితోపాటు మరికొందరికి తినిపించి సత్కరించారు. అలాగే మసీదుపురం గ్రామంలో టిడిపి నాయకులు నరాల చంద్రమౌళీశ్వర రెడ్డి, మాజీ సర్పంచ్ జయ చంద్రా రెడ్డి ఆధ్వర్యంలో వీధుల్లో తిరిగి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మహానంది, బుక్కాపురం, తిమ్మాపురం గ్రామాలలో విజయోత్సవాలు జరుపుకొని టపాకాయలు పేల్చారు. కార్యక్రమంలో మహానంది దేవస్థానం మాజీ ధర్మకర్త పెనుబడి వీరభద్రుడు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, ఒంటెద్దు ప్రతాప రెడ్డి, దీనేష్ కూమార్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వీధుల్లో ర్యాలీగా వెళ్తున్న టిడిపి నాయకులు

# బిసి జనార్ధన్ రెడ్డికి మంత్రి పదవి దక్కేనా..?

**ప్రజాశక్తి - బనగానపల్లె**

బనగానపల్లె ఎమ్మెల్యేగా విజయం సాధించిన బీసీ జనార్ధన్ రెడ్డికి మంత్రి దక్కుతుందని నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు చర్చించుకుంటున్నారు. బనగానపల్లె నుండి రెండోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన బీసీ జనార్ధన్ రెడ్డి పార్టీ అభివృద్ధికి, విజయం కోసం ఎంతో కృషి చేశారని, అధిష్టానం ఆయన సేవలను గుర్తించి మంత్రి పదవి ఇవ్వనున్నట్లు నాయకులు, కార్యకర్తలు పేర్కొంటున్నారు. నెల్లూరు, ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గాలకు కోఆర్డినేటర్‌గా ఉండి రెండు జిల్లాలలో పార్టీ అభివృద్ధి కోసం బీసీ జనార్ధన్ రెడ్డి అలుపెరగని పోరాటాలు చేశారని నాయకులు పేర్కొంటున్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌లతో బీసీ జనార్ధన్ రెడ్డికి మంచి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, మంత్రి పదవి వస్తుందని కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. బిసి జనార్ధన్ రెడ్డి 2012లో టిడిపిలో చేరి బనగానపల్లె నియోజకవర్గ ఇన్చార్జిగా పని చేశారు. 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారు. 2019 ఎన్నికల్లో ఓడిపోయినా పార్టీ కార్యకర్తలకు,

ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి

నాయకులకు అండగా ఉండి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేశారు. అనతికాలంలోనే రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను, నారా లోకేష్ యువగళం పాదయాత్రను, చంద్రబాబు సమావేశాలను విజయవంతం చేసి రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్న బిసి జనార్ధన్ రెడ్డి మంత్రి పదవి వస్తుందని నియోజకవర్గ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

# అటవీ సంరక్షణకు రెండు బేస్ క్యాంపులు ఏర్పాటు

**ప్రజాశక్తి - రుద్రవరం**

రుద్రవరం అటవీ రేంజ్ పరిధిలో అటవీ సంరక్షణ కోసం అధికారులు రెండు నూతన బేస్ క్యాంపులు ఏర్పాటు చేశారు. గత నెల 26 వ తేదీ నుంచి రుద్రవరం ఫారెస్ట్ సెక్షన్ పరిధిలోని శిలుమానుపెంట, నూతల సెక్షన్ పరిధిలోని నాగంబావి సమీపంలో బేస్ క్యాంపులను ఏర్పాటు చేశారు. ఒక్కో బేస్ క్యాంపు దగ్గర ముగ్గురు ప్రొటెక్షన్ వాచర్లను అధికారులు నియమించారు. రుద్రవరం అటవీ రేంజ్ పరిధిలోని నూతల సెక్షన్ నాగంబావి బేస్ క్యాంపును తెలుగంగ ప్రధాన కాలువ బ్రిడ్జి ప్రాంతంలో ఏర్పాటు చేశారు.

నూతల సెక్షన్ నాగంబావి ప్రాంతంలో ఏర్పాటు చేసిన బేస్ క్యాంపు దగ్గర విధులు నిర్వహిస్తున్న ప్రొటెక్షన్ వాచర్లు

ఇందులో అహోబిలం గ్రామానికి చెందిన చెంచు యువకులు లక్ష్మీ నరసింహ, సురేంద్ర, ఆంజనేయులను ప్రొటెక్షన్ వాచర్లుగా నియమించారు. రుద్రవరం అటవీ రేంజ్ పరిధిలో ఇప్పటికే శీతల్, సాంబార్, ఊట్ల బేస్ క్యాంపులో ఒక్కో బేస్ క్యాంపులో 5 మంది చొప్పున 15 మంది ప్రొటెక్షన్ వాచర్లు విధులు నిర్వహిస్తున్నారు. అలాగే రుద్రవరం అటవీ రేంజ్ పరిధిలో అహోబిలం, రుద్రవరం ,నూతల సెక్షన్, ఆలమూరు, డి వండిపెంట సెక్షన్ల పరిధిలో 14 బీట్లు ఉండగా రేంజ్ అధికారిగా శ్రీపతి నాయుడుతో పాటు 20 మంది ఫారెస్ట్ సిబ్బంది వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్నారు.

# అఖిలప్రియకు మంత్రి పదవి ఇవ్వాలి : టిడిపి

**ప్రజాశక్తి - చాగలమర్రి**

నిరంతరం ప్రజల సేవలో ఉన్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మంత్రి పదవి ఇవ్వాలని పార్టీ నాయకులు కోరారు. గురువారం మండలంలోని ముత్యాలపాడు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు బ్రహ్మానంద రెడ్డి, డిఎం భాష, మస్తాన్, సింహాద్రి, షుకూర్, షరీఫ్, మహమ్మద్, ఓబయ్య, రమణారెడ్డి, లక్ష్మయ్యలు భూమా అఖిలప్రియ గెలుపు సందర్భంగా పెద్ద వంగలి గ్రామంలోని దర్గాలో ప్రత్యేక ఫాతేహాలు


పెద్ద వంగలి దర్గాలో పూజలు నిర్వహిస్తున్న తెలుగు తమ్ముళ్లు

నిర్వహించారు. అలాగే కడప జిల్లాలోని మైలవరం డ్యామ్ సమీపంలోని గైబుసాపహాడ్ దర్గాలో, ఆళ్లగడ్డలోని ఓబులంపల్లె యాదవాడలోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. **ఆళ్లగడ్డ** : మండలంలోని కోట కందుకూరు గ్రామం ముస్లిం సోదరులు ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా అఖిల ప్రియ గెలించినందుకు దర్గాలో మాజీ జడ్పీటీసీ సుద్ద పల్లె చాంద్ బాషా, సివిల్ కాంట్రాక్టర్ నన్నేభై గారి జిలాన్ ఆధ్వర్యంలో 101 టెంకాయలు కొట్టి మొక్కుబడిని తీర్చుకున్నారు. ఎమ్మెల్యే అఖిలప్రియకు మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆళ్ల పెద్ద సుబ్బయ్య, ఇస్మాయిల్, మాబుపీరా, మహబూబ్ బాషా, పక్కీర్ భాషా, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

**బిసికి మంత్రి పదవి ఇవ్వాలి : టిడిపి**

**కోవెలకుంట్ల** : బనగానపల్లి ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి పార్టీ అధిష్టానాన్ని కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుంచి పార్టీ అధికారంలో లేకపోయినా బిసి జనార్ధన్ రెడ్డి నిరంతరం పార్టీ అభివృద్ధి కోసం పని చేశారన్నారు. జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో గెలిచిన బీసీ జనార్ధన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మోహన్ రెడ్డి, సుబ్బారెడ్డి, అమడాల మద్దిలేటి, పంపమన్న సుబ్బారెడ్డి, సునీల్ రెడ్డి, కలుగొట్ల నాగార్జున రెడ్డి పాల్గొన్నారు. **సంజామల :** బనగానపల్లి ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ నాయకులు దస్తగిరి మాదిగ, కమ్మిగిరి మాదిగ, ఎల్లప్ప మాదిగ తదితరులు కోరారు.

ఆళ్లగడ్డ : దర్గాలో టెంకాయలు కొడుతున్న నాయకులు

ఎమ్మెల్యే ఫరూక్‌ను సన్మానిస్తున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు

## గెలుపుతో బాధ్యత పెరిగింది

**- ఎమ్మెల్యే ఎన్ఎండి ఫరూక్**

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

అధికార వైసిపిని చెల్లాచెదురు చేసిన చారిత్రక విజయం కూటమిదని, గెలుపుతో బాధ్యత మరింత పెరిగిందని నంద్యాల ఎమ్మెల్యే ఎన్ఎండి ఫరూక్ అన్నారు. ఎమ్మెల్యే ఎన్ఎండి ఫరూక్‌ని నంద్యాల టిడిపి కార్యాలయంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో తనకు 40 ఏళ్ల రాజకీయ పరిచయం ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేరుస్తామని అన్నారు. సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒక్కసారి అధికారం ఇచ్చాక ఏం చేసినా సహిస్తారు, భరిస్తారు అనే తరహాలో వ్యవహరించడంతోనే వైసిపిని కిలోమీటర్ల లోతున భూమిలో ప్రజలు పాతిపెట్టేశారని అన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు మారుతీ కుమార్, కౌన్సిలర్ ఖండే శ్యాం సుందర్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నాయకుడు మృతి

**ప్రజాశక్తి - మిడుతూరు**

మండలంలోని కడుమూరు గ్రామంలోని ముస్లిం కాలనీకి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు అబ్దుల్ హలీం గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. విషయం తెలిసిన నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య గ్రామానికి చేరుకుని అబ్దుల్ హలీం మృతదేహానికి నివాళులు అర్పించారు. అలాగే టిడిపి మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, ఇద్రుస్, సుధాకర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మాక్బుల్, బస గౌడ్, ఉబేదుల్లా, భాస్కర్, హాజమత్, పరుశరాం, దాసు, రాజారావు, రాజు, కురువ వెంకటేశ్వర్లు తదితరులు నివాళులు అర్పించారు.

## రాష్ట్రానికి పట్టిన పీడ పోయింది : టిడిపి

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

ఆంధ్ర రాష్ట్రానికి పట్టిన పీడ ఈ నెల 4వ తేదీతో వదిలిపోయిందని, రాష్ట్ర ప్రజలందరూ ఏకతాటిపైకి వచ్చి ఎన్డీఏ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీలతో గెలిపించుకొని, రాష్ట్ర భవిష్యత్తుకు నాంది పలికారని టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ అన్నారు. గురువారం నంద్యాలలోని మౌలానా ముస్తాక్ అహ్మద్ కార్యాలయంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా కృషి చేస్తారన్నారు. ఎన్డీఏ కూటమిని గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయనను పలువురు ముస్లిం మైనారిటీ మత పెద్దలు కలిసి ఘనంగా సన్మానించారు.

మౌలానా ముస్తఫాను సన్మానిస్తున్న ముస్లిం మైనార్టీలు

కరపత్రం విడుదల చేస్తున్న దృశ్యం

## సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టాలి

**10న సిద్ధేశ్వరం అలుగు వార్షికోత్సవం : బొజ్జ**

**ప్రజాశక్తి - నంద్యాల**

రాయలసీమ కరువు పరిష్కారానికి, శ్రీశైలం ప్రాజెక్టు జీవిత కాలం పెరగడానికి సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి స్పష్టం చేశారు. గురువారం నంద్యాల సమితి కార్యాలయంలో సిద్ధేశ్వరం అలుగు 8 వ వార్షికోత్సవ కరపత్రాలను సమితి కార్యవర్గ సభ్యులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10న చేపడుతున్న సిద్దేశ్వరం అలుగు 8వ వార్షికోత్సవంలో పెద్ద ఎత్తున విద్యార్థులు, యువత, రైతులు కార్మికులు, వ్యాపారులు, ఉద్యోగస్తులు, వివిధ వృత్తుల నిపుణులు, ప్రజలు పాల్గొని రాయలసీమ ఉజ్వల భవిష్యత్తుకు పాలకులపై ఒత్తిడి పెంచాలని కోరారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు వై.యన్.రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, రాఘువేంద్ర గౌడ్, మహేశ్వరరెడ్డి, పట్నం రాముడు, కొమ్మా శ్రీహరి, నిట్టూరు సుధాకర్ రావు పాల్గొన్నారు.

## చిన్నారులను అంగన్వాడీలలో చేర్పించండి

**ప్రజాశక్తి - రుద్రవరం**

చిన్నారులను అంగనవాడీ కేంద్రాలలో చేర్పించాలని అంగన్వాడీ కార్యకర్తలు రాజేశ్వరమ్మ, రాజేశ్వరిలు తల్లిదండ్రులను కోరారు. గురువారం మండలంలోని మత్తలూరు గ్రామంలో అంగన్వాడీ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులకు 3 సంవత్సరాలు వచ్చాక ప్రైవేటు పాఠశాలకు పంపకుండా, అనవసర ఖర్చులు పెంచుకోకుండా అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించాలని, పిల్లలకు మానసికంగా ధృఢత్వం పెంపొందేలా, సామాజిక విలువలు అలవర్చుకునేలా ఆట పాటలతో చక్కటి విద్యాబుద్ధులు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయాలు సరోజ, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 8న సిపిఎం మండల కమిటీ సమావేశం

**ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్**

నందికొట్కూరు పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ఈ నెల 8న శనివారం నాలుగు మండలాల కమిటీ సభ్యుల సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్ హాజరవుతారని, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై, భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు చెప్పారు. పార్టీ సభ్యులందరూ తప్పనిసరిగా సకాలంలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎం.నాగేశ్వరరావు

# వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

**- రోడ్డు ప్రమాదంలో ఒకరు.. విద్యుత్ షాక్‌తో ఇద్దరు..**

**ప్రజాశక్తి - బనగానపల్లె**

మండలంలోని యనకండ్ల గ్రామ సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బనగానపల్లె పట్టణంలోని కొండపేటకు చెందిన మెహందీ హసన్ (20) మృతి చెందాడు. మరో వ్యక్తి మస్తాన్ వలికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. మెహందీ హసన్, మస్తాన్ వలి మోటార్ సైకిల్‌పై కర్నూలు నుండి బనగానపల్లెకు వస్తుండగా యనకండ్ల గ్రామ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. మెహందీ హసన్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మస్తాన్ వలిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామిరెడ్డి తెలిపారు

**విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి**

బనగానపల్లె మండలంలోని పలుకూరు గ్రామంలో నాపరాతి గనుల్లో విద్యుత్ షాక్‌తో పాండు(30) మృతి చెందినట్లు నందివర్గం ఎస్సై తిరుపాల్ గురువారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. పలుకూరు గ్రామానికి చెందిన పాండు గుండం నాగేశ్వర్ రెడ్డి వద్ద గుమస్తాగా పని చేస్తున్నాడు. గని గుంతలో నీళ్లను తోడెందుకు మోటర్‌ను ఆన్ చేసేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై గని గుంతలో పడి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**బేతంచెర్లలో విద్యుత్ షాక్‌తో మహిళ మృతి**

**బేతంచెర్ల** : బేతంచర్లలోని సబ్ రిజిస్టర్ కార్యాలయం సమీపంలోని ఎన్‌జిఒ కాలనీలో నివాసం ఉంటున్న గాజుల బాలీశ్వర్ రెడ్డి భార్య ఈశ్వరమ్మ (48) గురువారం విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఈశ్వరమ్మ ఇంట్లో స్విచ్ ఆన్ చేయడానికి వెళ్ళగా షార్ట్ సర్క్యూట్‌తో కింద పడింది. ఆమెను కుటుంబ సభ్యులు హుటాహుటిన బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

మృతి చెందిన మోహందీ హసన్

మృతి చెందిన పాండు

మృతి చెందిన మహిళ

## నీట్‌లో బేతంచర్ల విద్యార్థికి 616 మార్కులు

**ప్రజాశక్తి - బేతంచర్ల**

బేతంచెర్ల పట్టణానికి చెందిన కంచర్ల సురేష్ చౌదరి కుమారుడు కంచర్ల వారిస్ చౌదరి నీట్ ఫలితాల్లో 616 మార్కులు సాధించాడు. విషయం తెలుసుకున్న బేతంచర్ల మండల కమ్మ సంఘం ఆధ్వర్యంలో నాయకులు ఎల్ల నాగయ్య, తిరుమలేష్ చౌదరి, సుధాకర్ చౌదరి, చంద్రశేఖర్ చౌదరి తదితరులు విద్యార్థి వారిస్ చౌదరిని శాలువాలతో సత్కరించి అభినందించారు.

విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

## 15 ఏళ్లుగా ఆగిన కస్తూర్బా ప్రహరీ పనులు

**- పాఠశాల, కళాశాలకు రక్షణ కరువు**

**- పట్టించుకోని అధికారులు**

**ప్రజాశక్తి- చాగలమర్రి**

చాగలమర్రిలోని కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. పనులు నిలిచిపోయి దాదాపు 15 ఏళు అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పాఠశాలను 2007లో ప్రారంభించారు. పాఠశాల భవనం ప్రహరీ పనులకు రూ.20 లక్షలు నిధులు కేటాయించారు. పాఠశాల ఇరుపక్కల ప్రహరీ పనులు పూర్తి చేసినప్పటికీ ముందు భాగాన పనులు ఆగిపోయాయి. దీనివల్ల రక్షణ ఏర్పాటు చేయలేదు. 15 ఏళ్ల గడిచినా ప్రహరీ పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి. పాఠశాల ఆవరణలో ఇంటర్ కళాశాల కూడా ప్రారంభించారు. అయితే ప్రహరీ పనులు చేపట్టలేదు. దీంతో కళాశాల విద్యార్థినులు, పాఠశాలలో చదివే విద్యార్థినులకు రక్షణ కొరవడింది. పాఠశాలలు తెరిచే నాటికి ప్రహరీ పనులు పూర్తి చేసి రక్షణ గేటు ఏర్పాటు చేయాలని బాలికల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎస్వోను వివరణ కోరగా ప్రహరీ పనులకు స్థల వివాదమే ఆటంకమన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, రెవెన్యూ అధికారులు సమస్యను పరిష్కరించి ప్రహరీ పనులు చేపట్టేలా చూడాలని కోరామన్నారు.

చాగలమర్రిలో అసంపూర్తిగా కస్తూర్బా పాఠశాల ప్రహరీ పనులు

# ఉప్పొంగిన వాగులు, వంకలు

**5వ పేజీ తరువాయి..** తదితర గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే మిడుతూరు నుండి నంద్యాలకు వెళ్లే రోడ్డు మార్గంలో కాకిలేరు వాగు, కుందూ నది పొంగి ప్రవహించడంతో మధ్యాహ్నం 12 గంటల వరకు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య మిడుతూరుకు చేరుకుని పరిశీలించారు. కాకిలేరు వాగుకు నీరు ఎలా వస్తుందని, ఎక్కడ నుంచి ప్రవహిస్తుందని టిడిపి మండల కన్వీనర్ ఖాతా రమేష్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోకి నీళ్ల రాకుండా చర్యలు తీసుకునే విధంగా చేస్తామని ఎమ్మెల్యే ఆ కాలనీ వాసులకు భరోసా ఇచ్చారు. అలాగే గ్రామంలో విజయ అనే వ్యక్తికి ఇల్లు కూలిపోవడంతో ఎమ్మెల్యే ఆ ఇంటిని పరిశీలించి వారికి ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం వచ్చే విధంగా చేస్తామని హామీనిచ్చారు. ఇంటిలో రాత్రి సమయంలో ఎవరు పడుకోకుండా ఆరుబయట రేకుల షెడ్‌లో ఉండడం వలన ప్రాణనష్టం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు. **సంజామల :** సంజామల మండలంలో కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. పాలేరు వాగు ఉప్పొంగి ప్రవహించడంతో రవాణా స్తంభించిపోయింది. ఎక్కడి బస్సులు అక్కడే నిలబడిపోయాయి దీంతో ప్రయాణికులు చాలా ఇబ్బంది పడ్డారు. **నందికొట్కూరు టౌన్ :** నందికొట్కూరు మండలంలో బుధవారం రాత్రి కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. మండలంలోని అల్లూరు, వడ్డెమాను, గ్రామాలలోనీ పంట పొలాలు జలమయమయ్యాయి. వడ్డేమాను గ్రామంలోని బీసీ కాలనీలో ఇళ్లలోకి వరద నీరు చేరి ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. వడ్డేమాను గ్రామం నుండి బ్రాహ్మణకొట్కూరుకు వెళ్ల రోడ్డు వరద నీటి ప్రవాహానికి కోతకు గురవడంతో వడ్డేమాను నుండి బ్రాహ్మణ కొట్టుకూరు వెళ్లడానికి ప్రజలకు అంతరాయం ఏర్పడింది. అలాగే నందికొట్కూరు పట్టణంలో హాజీ నగర్, మారుతి నగర్‌లో రోడ్లు జలమయ్యాయి. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో వర్షపు నీరు చెరువును తలపించింది. **కోవెలకుంట్ల :** మండలంలో బుధవారం రాత్రి 11 గంటల నుంచి గురువారం తెల్లవారుజాము 5 గంటల వరకు వర్షం కురవడంతో వాగులు, వంకలు ఉప్పొంగాయి. ఆర్టీసీ బస్టాండ్లో భారీగా నీరు నిలబడడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. **బేతంచెర్ల :** మండలంలోని పలు గ్రామాలలో పంట పొలాలు, రహదారులు జలమయమై చెరువులను తలపించాయి. బేతంచర్ల నుండి డోన్‌కు వెళ్లే రహదారిలో రంగాపురం వద్ద, గోధుమరి ఎల్లమ్మ గుడి వద్ద వర్షపు నీటికి రహదారి కొట్టుకుపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్పందించిన అధికారులు హిటాచి, జెసిబిలతో రహదారికి మరమ్మతులు చేసి వాహనాలను సురక్షితంగా అవతలి ఒడ్డుకు చేర్చారు. బేతంచెర్ల డ్రైవర్స్ కాలనీలో చర్చి, పలు గృహాల్లోకి వర్షపు నీరు చేరింది. హెచ్ కొట్టాల గ్రామం వద్ద పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. **బనగానపల్లె :** మండలంలోని పాతపాడు గ్రామ సమీపంలో నిర్మించిన పార్కులేషన్ ట్యాంక్ భారీ వర్షాలకు తెగిపోయింది. మండలంలోని పత్తె నగరం, కటికెవానికుంట గ్రామల కొండల్లో భారీ వర్షం కురిసింది.

బనగానపల్లె : భారీ వర్షాలకు తగిన పర్కులేషన్ ట్యాంకు

వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గిత్త జయసూర్య

సంజామల : ఉప్పొంగి ప్రవహిస్తున్న పాలేరు వాగు

నందికొట్కూరు : వరద నీటికి రోడ్డు కోతకు గురైన దృశ్యం

బేతంచెర్లలో చెరువును తలపిస్తున్న వర్షపు నీరు